# దైన్యంలేని జీవనం

'నా పర్సులో డబ్బు పెట్టింది ఎవరు?' గట్టిగా అడిగాడు రాజు. ఎవరూ మాట్లాడలేదు. మళ్ళీ పెద్దగా అడిగాడు. బదుల్లేదు, మంచం మీద నుంచి లేవకుండానే 'ఏమయిందీ నాన్నా' అంది రాజు భార్య. ఆమె భర్తను నాన్నా అనిపిస్తుంది.

రాజువెళ్ళి భార్య మంచం మీద కూర్చుని 'తల్లీ ఎవరో నా పర్సులో పదివేలు డబ్బుపెట్టారు' రాజు భార్యను తల్లీ అంటాడు. కూతుళ్ళను అమ్మా, తల్లీ అంటాడు. అది అతడి తల్లి ప్రభావం, కొడుకుల్ని నాన్నా, తండ్రి అంటాడు.

'పదివేలా?' అంటూ అటూ ఇటూ చూచింది. 'మీరే ఏమయినా డ్రా చేశారేమో చూడండి నాన్నా' అంది.

'నాకింకా మతిమరుపు రాలేదు' అంటూ మంచం మీద నుంచి లేచి హాల్లోకి వచ్చాడు. ఉదయమే పర్సు చూచుకొంటే డబ్బు కనిపించింది.

'పర్సులోంచి చెప్పకుండా ఎవరైనా డబ్బుతీస్తే అడగాలి కానీ, పెడితే అడగటం దేనికి?'

'ఏమ్మా? పర్సులోంచి తీసినా, పర్సులో పెట్టినా ఒక్కటే! జరగరానిది జరిగినట్లే.' రాజు బదులు చెప్పాడు.

ఇంటినిండా మనుషులున్నారు. ఎవరు డబ్బు పర్సులో పెట్టారో తెలుసుకోవడం కష్టమే.

ఇంట్లో ఇద్దరు కొడుకులు, కోడళ్ళు, ఇద్దరు కూతుళ్ళు, అల్లుళ్ళు, ఒక్కొక్క కుటుంబంలో ఇద్దరేసి పిల్లలు చొప్పున మొత్తం నలుగురు మనుమళ్ళు నలుగురు మనుమరాళ్ళు తామిద్దరు వెరసి ఇంట్లో పద్దెనిమిదిమంది ఉన్నారు.

పెద్ద మనుమడి వయస్సు పదమూడేళ్ళు. చిన్న మనమరాలి వయస్సు ఏణ్ణెల్లు. ఈ ఎనిమిది మందిలో ఎవరూ అంత డబ్బున్నవాళ్ళుకారు.

పిల్లలు, వాళ్ళ భార్యలు భర్తలు ఎనిమిది మందీ ఉద్యోగాలలో ఉన్నారు. ముప్పై వేలనుంచి అరవై వేల దాకా నాలుగు కుటుంబాలకు నెలలజీతాలు వస్తాయి. వాళ్ళకు పదివేలు పెద్దమొత్తంకాదు, కాని అది వాళ్ళు తన పర్సులో పెట్టటం పెద్దవిషయమే.

ఈ నాలుగు కుటుంబాలలో ఎనిమిది మందిలో ఎవరో అదిపెట్టి ఉండాలి. తను డ్రా చేయలేదు.

ఎవరు పెట్టారో తెలియడం లేదు. ఎవర్ని అడుగుతారో అని అందరూ ముఖం చాటు చేసుకొంటున్నారు. అందరూ మాట్లాడుకొని పెట్టి ఉంటారా అని సందేహం కలిగింది. మొత్తం మీద డబ్బు పెట్టిన వాళ్ళకు, పెట్టని వాళ్ళకు విషయం తెలుసు.

'దొంగకు ముఖం నలుపు నాకు తెలుస్తుంది' అని చిన్నప్పుడు అన్నట్లుగా ఇప్పుడూ అందామని చూశాడు రాజు. కాని అప్పుడు వీళ్ళు చిన్నపిల్లలు. ఎక్కడ తన ముఖం నల్లగా ఉంటుందోనని నలుగురూ ముఖాలు కడుక్కొని వచ్చేవాళ్ళు. ఇప్పుడు వీళ్ళు పెద్దవాళ్ళు అయిపోయారు. వాళ్ళిప్పుడు ముఖాలు కడుక్కొని రారు. తన ముఖం నలుగురు చేరి కడిగినా, తలస్నానం చేయించినా, చేయించగలరు.

తన పిల్లలకంటే కూడా ప్రేమగా ఉంటే కోడళ్ళో అల్లుళ్ళో కూడా ఆ డబ్బు పెట్టి ఉండవచ్చు. వాళ్ళను ఏమని అడగటం?

మనమళ్ళను మనమరాళ్ళను గూఢచారులుగా నియమించి, డిటెక్షన్ చేయిద్దామంటే వాళ్ళు ముద్దులు పెడతారు. ముచ్చట్లు చెబుతారు. మొండిగా తిరుగుతారు. కానీ వాళ్ళు వాళ్ళ తల్లిదండ్రులకు సరిపోయిన సంతానం. అమ్మానాన్నలమీద డిటెక్టివ్‌లుగా పనిచేయరు. సమాచారం చెప్పరు.

వాళ్ళను అడిగి విషయం తెలుసుకోవడం కష్టమే. ఎవరూ ఎదురు పడడం లేదు. ఎక్కడివాళ్ళు అక్కడ, ఏవో పనులు చాలా సీరియస్‌గా చేసుకొంటున్నారు.

నెత్తిమీద ఒకడు, నడుంమీద ఒకడు ఉయ్యాల ఊగుతున్న కొడుకుల్ని పట్టించుకోకుండా పరీక్షకు పోవలసిన విద్యార్థిలాగా పేపరు పూర్తిగా దీక్షగా చదువుతున్నాడు పెద్దల్లుడు.

మార్కెట్టుకు వెళ్ళొస్తానని పెద్దకొడుకు సంచి తీసుకొని, అంతకుముందే తండ్రి దగ్గర డబ్బు తీసుకొని కారు తీసుకొని వెళ్ళిపోయాడు. ఇప్పుడిప్పుడే ఇంటికి రాడు.

చిన్న కొడుకు వాకింగుకు అనిపోయి గంటయింది. ఎంతదూరం నడుస్తాడో, ఎంతసేపు నడుస్తాడో , ఎప్పటికి నడక పూర్తి అవుతుందో చెప్పటం కష్టం.

చిన్నల్లుడు, చిన్నకూతురు రాత్రేవచ్చారు. ఇంకా నిద్ర లేచినట్లులేరు. పిల్లలు నిద్రలేచి పాలు తాగి తల్లిదండ్రుల్ని లేపటానికి విశ్వప్రయత్నం చేస్తున్నారు. ఇంత అల్లరికి లేవని వాళ్లను ఎవరు మాత్రం లేపగలరు? వాళ్ళ నిద్రను చెడగొట్టటం న్యాయం కాదు.

పెద్ద కోడలు, పెద్దకూతురు వంటగదిలో యమసీరియస్‌గా ఉన్నారు. వంటామెతో అరగంటనుంచి ఏం చేయాలో ఎలా చేయాలో ట్రయినింగ్ ఇస్తూ వాళ్ళూ చేస్తున్నారు. ఈ ట్రయినింగ్ క్లాసు గంట అయితేగాని పూర్తికాదు.

చిన్నకోడలు అల్లికలు, కుట్టులు, పాల్స్ కోసం వందలాది చీరెలు జాకెట్టులు రాశి

పోసుకుని కూర్చున్నట్లుంది. చుట్టూ ఉన్న బట్టల్లో మునిగిపోయి తలమాత్రమే కనిపిస్తూ మనిషి ఉందని తెలుస్తూ ఉంది.

మేనెల ఒకటో తేదీ రాజుకు స్కూలులో చదువుకొనే రోజుల్నుంచి అభిమానం, రెండోతేదీ తన పెళ్ళి. రోజు. ఆ ఒక్కరోజు చాలా ఇష్టంగా చూసుకొంటాడు. తలస్నానం చేస్తాడు. కొత్తబట్టలు కట్టుకొంటాడు. వంటావార్పు బాగుండాలని కోరుకొంటాడు.

కొడుకులు కూతుళ్ళుకూడా తమకు జన్మనిచ్చినా తల్లిదండ్రుల పెళ్ళిరోజు పట్ల చాలా ఆసక్తి, ఆత్మీయత చూపుతూ తల్లిదండ్రుల్ని ఉత్సాహ పరుస్తారు.

మే మూడో తేదీ రాజుకు డాక్టరేట్ పట్టం కోసం సిద్ధాంతగ్రంథం సమర్పించినరోజు. ఆరోజు తన జీవితంలో వచ్చిన పరిణామాలకు అభివృద్ధికి మూలకారణమైన రోజుగా భావిస్తాడు రాజు.

మేనెల ఆరోతేదీ రాజు తల్లి వర్ధంతి. తల్లి అంటే రాజుకు విపరీతమైన ప్రేమ. గౌరవం, భక్తి. ఆమె అతడికి దైవం కంటే ఎక్కువ. తను పుట్టడానికే కాదు, పెరగడానికి, పెద్దవాడు కావటానికి, విద్యాబుద్ధులు నేర్పటానికి, జీవితం అర్థం చేసుకోవటానికి, ఆశించటానికి, ఆరాటపడటానికి అభివృద్ధి చెందడానికి అన్నింటికీ ఆమే బీజం.

అందువల్ల మేనెల మొదటివారం అతిపవిత్రమైన వారంగా రాజు భావిస్తాడు. ఆ వారం ఎక్కడికీ పోడు. ఉద్యోగంలో ఉన్నప్పుడు కూడా ఊళ్ళోనే ఉండేవాడు. రిటైరు అయింతర్వాత ఇంట్లోనే ఉంటున్నాడు.

పిల్లలు నాలుగు కుటుంబాలు పిల్లలతో వచ్చి వీలయినంత వరకు ఆ వారం తల్లిదండ్రులతో గడపడానికి ఇష్టపడతారు. ఎంత తొందరపనులున్నా, అన్నీ పక్కన పెట్టి వచ్చి ఆ వారం రోజులూ ఉంటారు. మరీ అత్యవసరమైనవనుకున్నా, గొంతుమీదికి వచ్చే తొందరలున్నా, ఒకరోజు ఆలస్యంగా రావచ్చు. ఒకటో రెండో రోజులు ముందుగా వెళ్ళి వచ్చుకాని, కచ్చితంగా, రెండూ మూడు తేదీల్లో మాత్రం తల్లిదండ్రులు దగ్గరుంటారు వాళ్ళు.

రాజు మేడే మీటింగుకు బయలుదేరుతూ పర్సు చూసుకున్నాడు. కార్మికులకు, కర్షకులకు మేడే గిఫ్టు, బహుమతి, బోనస్ ఇస్తే మేలేకానీ తనకెందుకీ డబ్బు? ఎవరు పెట్టి ఉంటారు?

తన పిల్లల బాల్యం, మనుమళ్ళు, మనుమరాళ్ళ బాల్యం చూస్తుంటే రాజుకెంతో సంతోషంగా ఉంటుంది. తన బాల్యం గుర్తుకువస్తే గుండె కలుక్కు మంటుంది. తన బాల్యం ఆకలికి, ఆశకి, మధ్య ఆరాటంగా, పోరాటంగా సాగింది. కూలీనాలీ చేసి, పొట్ట పోసుకొనే తల్లిదండ్రులకు పుట్టిన కొడుకు రాజు. వీడు ఎద్దుతోక మెలేయకూడదని, పేడ తీయరాదని, జీతగాడుగా ఉండరాదని, దొరచేత తిట్లు దెబ్బలు తినకూడదని, అవమానాలు అగచాట్లు కలగరాదని, చదువుకోవాలని, పలకా బలపం కొనిపెట్టిన తల్లి, ప్రేమను గుండెల్లో, క్రమశిక్షణ బెత్తంతో, అన్నం ముద్దని చేతిలో పెట్టుకొని, కొడుకును పెంచింది. పెద్దచేసింది, అన్నం దిని

కాదు, ఆమె ప్రేమ తిని రాజు పెరిగి పెద్ద వాడయ్యాడు.

తన పిల్లలకు తానా కష్టాలు కలిగించ లేదు రాజు. తన తల్లి తనకిచ్చిన ప్రేమను తాను తన నలుగురిపిల్లలకు పంచి ఇచ్చాడు. తానూ తన భార్య ఉద్యోగం చేయటం వల్ల ఆర్థికంగా పిల్లలకు ఏ అవస్థా రాలేదు. ఉన్నంతలో వాళ్ళకు తిండి, బట్ట కంటే ఎక్కువగా చదువుకు అంతకంటే అధికంగా ప్రేమ పంచి ఇచ్చి, తన తల్లి చదువుతో తనను తరిమినట్లే. తాను తన పిల్లల్ని పరుగులెత్తించి బాధ్యత గుర్తెరిగేట్టు చేసి, జీవితంమీద ఆసక్తి, అనురక్తీ పెంచి, వాళ్ళు పోరాడేవాళ్ళుగా, ఆశించేవాళ్ళుగా, సాధించేవాళ్ళుగా, సమర్ధులుగా పెంచాడు. తల్లిదండ్రుల అదృష్టం కొద్దీ వాళ్ళు బాగా చదువుకొన్నారు. మంచి సంబంధాలు వచ్చాయి. మంచి ఉద్యోగాల్లో చేరారు. చక్కని పిల్లలు కలిగారు. సంసారాలు ఒక పద్ధతి ప్రకారం సాగి పోతున్నాయి.

వాకింగ్ నుంచి చిన్నకొడుకు వచ్చాడు. జాగింగ్ షూస్ విప్పుతున్నాడు. కుట్లు, అల్లికలు, ఎంబ్రాయిడరీ కొండల్లోంచి లేచి, చిన్నకోడలు ఎదురుగా వచ్చి షూస్ దులిపి, సాక్స్ సాగదీసి, పక్కనే పెట్టి లుంగీ అందించింది. చిన్నకొడుకు వెళుతుంటే రాజు ఆపాడు.

'నాన్నా' అంటే 'ఏం నాన్నా' అన్నాడు. 'నా పర్సులో డబ్బు పెట్టావా?' అని అడిగితే 'ఏం డబ్బు?' అంటూ భార్యవైపు చూశాడు. 'మామయ్య పర్సులో ఎవరో పదివేలు పెట్టారట- మీరేమన్నా పెట్టేరేమోనని అడుగుతున్నారు' అంది.

చిన్నకొడుకు తండ్రి దగ్గరకు పోయి, పొట్టలో దూరినంతగా అనుకొని, కళ్ళలోకి చూస్తూ 'నాకు తెలియదు నాన్నా!' అన్నాడు. చిన్నప్పుడు 'ఏరా నాన్నా స్కూలుకు పోలేదు' అంటే ఇలాగే చూసేవాడు. ఇలాగే ఏదో సమాధానం చెప్పేవాడు. ఇంత పెద్దవాడయినా ఇద్దరు బిడ్డల తండ్రి అయినా, భార్య పక్కనే ఉన్నా, తండ్రి దగ్గర చిన్నపిల్లవాడిలాగా నిలబడతాడు చిన్నకొడుకు.

మరేమన్నా అడిగితే వాడు బాధపడతాడేమో. రాజు మరేమి మాట్లాడలేదు. ఊరికే నిలబడితే, 'స్నానం చేస్తా' అంటూ బాత్‌రూంలోకి వెళిపోయాడు. తోకమ్మటి నారాయణలాగా భార్య కూడా వెళిపోయింది.

చిన్నకొడుకు పిల్లలు ఉయ్యాలలోది హోలీ, ఇల్లంతా తిరుగుతూ ఏ మూలకు పోయినా కనిపించేది ప్రెట్టీ. దానికొక కోతిబొమ్మ. ఆడపిల్ల బొమ్మ ఉన్నాయి. వాటిని రెండు చేతులతో పట్టుకొని నడువలేని తను వాటిని నడిపిస్తుంది.

రాజుకొక నిర్ణయం నిశ్చయం స్పష్టంగా ఉన్నాయి. పిల్లలు చదువుకొని, ఉద్యోగాలలో చేరిందాకా ఏకష్టమూ రాకుండా, చూచుకొన్నాడు. వాళ్లచదువులు పేరిట బేంక్ అప్పులు చేయలేదు. వాళ్ళు అప్పులు తీర్చవలసిన స్థితిలో జీవితం ప్రారంభించ కూడదని కచ్చితమైన నిర్ణయం.

దానికి కారణం రాజు జీవితమే. తన చదువు కోసం తానే అప్పులు చేశాడు. నిజానికి తన స్కాలర్‌షిప్పు తనకు సరిపోయేది, చెల్లీ తమ్ముడూ కూడా చదువుకొంటుండే వాళ్ళు. ఆనర్సు చదువుతున్న మూడేళ్ళు చాలా అప్పులు చేయవలసివచ్చింది. ఉద్యోగంలో చేరిన మొదట్లో సగం జీతం అప్పులు తీర్చటానికి చెల్లించవలసివచ్చేది. అప్పట్లో జీతాలు కూడా పెద్దగా ఉండేవికావు. తల్లిని పోషిస్తూ, చెల్లిని తమ్ముణ్ణీ చదివిస్తూ సగం జీతంతో సంసారం సాగదీసుకుని రావటం అప్పట్లో కష్టం అనిపించలేదు. ఏ ఆదాయం లేకుండా అప్పులు చేసి కుటుంబం లాక్కుంటూ రావటం అలవాటు అయి ఉండటం వల్ల, సగం జీతం సరిపోతున్నట్లుగానే అనిపించేది. మూడేళ్ళలో మూడు సంవత్సరాల అప్పులు తీర్చేస్తే, పూర్తి జీతం చాలా మొత్తంగా కనబడి పెళ్ళిమీదికి ధ్యాసమళ్ళింది. తల్లి కూడా తొందరచేయసాగింది. భార్య కూడా ఉద్యోగిని కావటంతో అక్కరకు మించిన డబ్బు అందుబాటులో ఉంటున్నట్లుగా కనిపించసాగింది.

అయితే అప్పులు తీర్చే అవస్థ పిల్లలకు ఉండకూడదనుకున్న రాజు తమ జీతాలతోనే వాళ్ళను చదివించాడు. అంతేకాదు వాళ్ళు ఉద్యోగాలలో చేరితే పైసా కూడా ఇవ్వడు. మరొక నియమం కూడా వాళ్ళకు విధించాడు. ఏ పరిస్థితుల్లోనూ అప్పుచేయరాదు. ప్రతినెలా సగం జీతం మిగలాలి. బేంక్‌లో వేసుకోవాలి. తల్లిదండ్రులకు పైసా కూడా ఇవ్వరాదు. ఖర్చుచేయరాదు.

'మావి రెండు జీతాలు. ఒక జీతం ఎప్పుడూ మిగులుతుంది. మాకు మీ డబ్బు అవసరం ఎప్పుడూ ఉండదు. మీకు మీ జీతానికి మించిన డబ్బు అవసరాలకు అవసరం ఏమీ ఉండకూడదు. ఎప్పుడూ బేంక్‌లో డబ్బు పెరుగుతూ ఉండాలి. డబ్బు ఆదాచేయలేని మనిషి ప్రాణాన్ని ఆదా చేయలేడు. ఆరోగ్యం కాపాడుకోలేడు. జీవితంలో సుఖంగా బ్రతకలేడు. ఎవరిమీదో ఆధారపడతాడు. స్వేచ్ఛ కోల్పోతాడు. వ్యక్తిత్వం నాశనమవుతుంది. ఏ విలువలు నిలువవు. మనిషి డబ్బును జయించాలి. డబ్బు మనిషిని జయించకూడదు. నీదైన పైసా వృథాకారాదు. నీదికాని పైసా నీకు రారాదు. అది మిమ్మల్ని భ్రమలో ముంచి, నాశనంలోకి త్రొక్కి క్రూరంగా హింసించి భయంకరంగా పతితుల్ని చేస్తుంది.'

ఈసలహా పిల్లలకు అతి చిన్నతనం నుంచి తలలో నాటుకొంది. బాగా పనిచేసింది.

ఒకసారి పెద్దకొడుకు ఎక్కడో ఎక్కువ వడ్డీ ఇచ్చే ఏర్పాటు ఉంది. అక్కడా పెట్టుబడి పెడితే మంచిది. బెంక్‌లో ఉంటే అంత వడ్డీరాదని సలహా ఇచ్చాడు.

'ఎక్కువ వడ్డీకి ఆశపడకూడదు. అసలుకే మోసం వస్తుంది. ఇక స్థాయి దాటి వడ్డీ ఇచ్చే పరిస్థితి దేశ ఆర్థికస్థితిని నాశనం చేస్తుంది. అటువంటి దురదృష్ట సందర్భాలు మనం కోరుకోకూడదు. బేంక్ వడ్డీరేట్లు చాలు. అత్యాశ ఎప్పుడూ అనర్థకమే కాదు. ప్రమాదకరం కూడా.' ఆ తర్వాత ఎప్పుడూ బాబు సలహా ఇవ్వలేదు. అంతేకాదు. వాళ్ళ మిగులు ధనం కూడా జాగ్రత్తగా భద్రం చేయటం నేర్చుకొన్నారు.

'పేపర్లో సంగతేంటి స్వామీ' అంటూ తన భర్త దగ్గరకు పెద్దకూతురు చేరింది. తండ్రి

తలమీద కడుపుమీద పడి తొక్కుతున్న కొడుకులిద్దరూ తల్లి రాకతో తండ్రికి దూరమయ్యారు. లేకపోతే వాయించి పారేస్తుంది. ఆమెవి అచ్చంగా రాజు వాళ్ల తల్లిబుద్ధులు. క్రమశిక్షణ ప్రేమ రాజు తల్లి దగ్గర్నుంచి వచ్చినట్లున్నాయి. పెద్దల్లుడు కొంచెం ఊపిరి పీల్చుకున్నాడు.

'ఏమున్నాయి - మామూలే' అన్నాడు. వీళ్ళిద్దరూ మాట్లాడుకొనేమూడ్‌లో ఉన్నారని రాజు ఊహించి, వాళ్ళ గదిలోకి పోయి ఒక కుర్చీ లాక్కొని కూర్చున్నాడు.

మనుమళ్ళు ఇద్దరూ వచ్చి రక్షకభటుల్లా చెరో పక్కా నిలబడి, మెడ, తల, భుజం తడుముతూ ఉన్నారు.

'ఏం నాన్నా' అంది పెద్ద కూతురు.

'ఏం లేదు తల్లీ! నా పర్సులో ఎవరో పదివేలు పెట్టారు.'

'పదివేలా?'

'అవును. మీరేమయినా పెట్టారా?'

'మాకు తెలియదు నాన్నా' అని 'ఏవూరి బాంక్‌వో చూడు నాన్నా' అంది. పెద్దతల్లి ఉద్దేశం ఏ వూరి కట్టలో తెలిస్తే, ఎవరు పెట్టారో తెలుసుకోవచ్చునని. అవి ఇరవై అయిదొందలనోట్లు. బేంక్ కాగితాలు ఏమీ వాటిమీద లేవు.

'ఎందుకు పెట్టారు నాన్నా?' అంది.

'అది కనుక్కుందామనే - ఎవరు పెట్టాడో తెలిస్తే, ఎందుకు పెట్టారో తెలుసు కోవచ్చు.'

'నాకు తెలియదు నాన్నా' అని 'మీరేమన్నా పెట్టారా' అని భర్తను అడిగింది. 'నాదగ్గర డబ్బెక్కడుంది. అంతా నీ పెత్తనమే కదా' అన్నాడు పెద్దల్లుడు.

మనుమళ్ళ భుజాలమీద చేతులువేసి, ఊతకర్రల్లాగా వాళ్ళను నడుపుకొంటూ హాలులోకి వచ్చి, టీ.వి. దగ్గరకు చేరాడు రాజు. అతడి భార్య పాటలు వింటూ ఉంది. చూడదు. వింటుంది. అమెకు టీవి రేడియోతో సమానం. కారణం కంట్లో మందేసుకొంది. కంట్లో మందేసుకొంటేనే టీ.వి. ముందు కూర్చుంటుంది. లేకపోతే పడుకొంటుంది. కళ్ళు మూసుకున్నా, తెరిచినా బెడ్‌రూంలోంచి పాటలు వింటుంటుంది. చూడదు. హాల్లోని టీ.వి. బెడ్‌రూంలోకి రేడియో.

కుర్రవాళ్ళిద్దరూ టీ.వి. చానళ్ళు వాళ్ళ ఇష్టం వచ్చినట్లు చెడామడా తిప్పేశారు. అది కి.బే.చీ.చా. అంటూ నానా రకాల శబ్దాలు సృష్టించి, నానా బీభత్సం కలిగించి, జీవితం మీద విరక్తి పుట్టించి, స్మశానం వైపు పరుగులు తీయించే పకడ్బందీ వ్యూహంగా టీవిని విచిత్రశాస్త్ర సాంకేతిక పరికరంగా మార్చారు వీళ్ళు.

ఆ శబ్దాలకు కళ్ళు మూసుకొన్న రాజు భార్య కళ్ళు తెరచి చూచి ఏ వికారమూ లేని స్వచ్ఛ రూపంలో బొమ్మలేకుండా, లైటు లేకుండా, శబ్దం లేకుండా, కరెంటు పోకుండా, అసలు సిసలు పురావైభవ రూపంలో టి.వి. కనబడుతుంటే అమె ఒక్క నిట్టూర్పునిక్కచ్చిగా

విడిచి, మళ్ళీ కళ్ళు మూసుకుని, మౌనముద్ర వహించి మహర్షిణి లాగా మారి, కళ్ళలో మందులేని, నిద్రరాని, పనిలేని, అయోమయ అవస్థలో కూర్చుండిపోయింది.

కార్గిల్ పోరాటం ఆగిపోతే శబ్ద శూన్యంగా ఉన్న మంచుకొండల మధ్యకి వచ్చిన మానవమాత్రురాలిలాగా, పెద్దకూతురు వచ్చి, పిల్లల చేతుల్లోంచి రిమోట్ ఛాక్కొని, మళ్ళీ శబ్ద బ్రహ్మను ఆయింట్లో, టీ.వి.రూపం సృష్టించి, సృష్టికర్తను తాను సృష్టించి, విజయకేతనం ఎగురవేస్తూ, రిమోట్ వాళ్ళ అమ్మకిచ్చి, కుర్రవాళ్ళను భుజాలు పట్టుకొని బయటికి ఈడ్చుకుపోయింది. వాళ్ళు మొరాయిస్తూనే ఉన్నారు. హనుమంతుడి ముందా కుప్పిగంతులు!

ఈ టీ.వి. దైవసృష్టికాకపోతే ఇంతమంది ఇన్నిరకాలుగా దీన్ని విడవకుండా వాయిస్తుంటే ఏరోటికాపాట పాడుతూ అందర్నీ సంతోషపెడుతూ చెడిపోకుండా ఉందంటే, సృష్టిరహస్యం మనిషికి అర్థం కాకపోవటమేనని ఎవరైనా ఇంట్లో వ్యాఖ్యానం చేయవచ్చు. దీని సృష్టికి మూల పురుషుడు దేవుడేకాకపోతే శాస్త్రవేత్తల్ని, శాస్త్ర వికాసాన్ని శ్లాఘించి, శాస్త్రం సృష్టికి ప్రతిసృష్టి చేస్తోందని దేవుణ్ణే మళ్ళీ సృష్టిస్తుందని, ఆ సృష్టించే శక్తి మన చేతుల్లోకే వచ్చిందని తెలిసి, శాస్త్రాన్ని కాదంటే దాని ప్రతినిధి అయిన టి.వి.ని గుడికట్టి గుళ్ళో పెట్టి, ఎన్ని కోర్కెలు కోరితే అన్నిరకాల బొమ్మలు చూపించే, అన్ని అద్భుతాలు చేసే, అంత ఆశ్చర్యం కలిగించే దీన్ని పూజించటం ధర్మం. అసలు దేవుళ్ళు ఎప్పుడు ఏంచేస్తారో అర్థం కాదు. ఈటీ.వి. దేవుడిలా క్షణాల్లో కోరిన కోర్కె తీరుస్తుంది. నిజానికి దేవుడుకంటే టి.వి. గ్రేట్.

రాజు చిన్నతనంలో టి.వి. లేదు. ట్రాన్సిస్టర్ లేదు. రేడియోలేదు. గ్రాంఫోన్ ఉండేది. అదికూడా ఎక్కడో ఒకటీ అరా. తమ పల్లెలో మిలటరీ నుంచి వచ్చిన సుదర్శనరావు ఒకటి తెచ్చాడు. దానికి 'కీ' ఇచ్చేవాడు. పిన్ను పెట్టేవాడు. పాటలున్న రికార్డు పెట్టేవాడు. పిన్నున్న గిలకదానిమీద తిప్పిపెట్టేవాడు. రికార్డు తిరగేది. పాట వినవచ్చేది.

పాట ఎక్కడనుంచి వస్తూ ఉంది అనేది బాల్యంలో రాజుకు పెద్దమీమాంస. గ్రాంఫోన్ పెట్టెలోంచా, రికార్డు పెంకులోంచా, గిలకముల్లులోంచా అని గింజుకొని చచ్చేవాళ్ళు పిల్లలు. కుక్కపిల్ల కూర్చున్న తురాయి పువ్వులా విచ్చుకొన్న ఇనపచట్రంలోంచి పాట వినబడటం వాస్తవమే. కానీ పాట ఎక్కడపుడుతుందో తెలని ప్రశ్న. సెలవులయిపోయి సుదర్శనరావు మళ్ళీ మిలటరీకి పోతూ దాన్ని వెంటతీసుకొని పోకపోతేరోజంతా రాజు కూడా పిల్లలతో పాటు అక్కడే చేరి, కిటికీ కన్నాల్లోంచి, వాకిలి సందుల్లోంచి రెండూ మూస్తే సోరణగళ్ళలోంచి తొంగిచూస్తూ ఉండిపోయే వాడే. పిల్లల పోటు తట్టుకోలేక సుదర్శనరావు సాయంకాలం పూట మంచంవేసి, పక్కవేసి నడిమధ్యలో పీటవేసి, పీటమీద గ్రాంఫోను పెట్టి పెట్టి రికార్డులు పెడుతుంటే, మంచం చుట్టూ జనం, ముందుగా పిల్లలు, పల్లెలో ఉన్న వాళ్ళలో సగంమంది అక్కడే చేరి వినేవాళ్ళు. మాట్లాడి తిట్టులు తినేవాళ్ళు, తొంగి చూచేవాళ్ళు, నిక్కి చూచేవాళ్ళు, పాట కంటే చేరిన జనం గోల గొప్ప రద్దీగా ఉండేది.

తరవాత్తరవాత పెళ్ళిళ్ళలో గ్రాంఫోను రికార్డులు పెట్టటం, లౌడీస్పీకర్లు పెట్టడం, డాన్సులు పెట్టించడం వచ్చిందాకా గ్రాంఫోను అంటే ఉన్న మోజు చెప్పనలవికాదు.

రాజుకు చిన్నతనంలో గ్రాంఫోను తాకాలని మహాగుంజాటనగా ఉండేది. సుదర్శనరావు వాళ్ళ ఇంట్లో గ్రాంఫోను తాకే వీలులేదు. అంత దగ్గరగా పోయే మార్గం లేదు. చోటులేదు. జనం ఒకటే జనం. రాజుకున్న బలమైన ఆకోర్కె చాలా రోజులు తరువాత పెళ్ళికి పెట్టిన గ్రాంఫోను రికార్డులు, పెట్టె తాకటంతో తీరింది.

డబ్బులుంటే గ్రాంఫోనూ రికార్డులూ కొనుక్కోవచ్చునని. డబ్బులుండాలంటే ఉద్యోగం చేయాలని, ఉద్యోగం చేయాలంటే చదువుకోవాలని, తల్లి చెవిలో గూడుకట్టుకొని పోరు పెడుతూ ఉండేది.

రాజు జీతం సంపాదించుకొనే కాలానికి గ్రాంఫోను పాటలు పాతబడి పోయాయి. రేడియోవచ్చింది ట్రాన్సిస్టర్ వచ్చింది. చంకలో పిల్లిలా దాన్ని భుజానికి తగిలించుకొని, వీధి వీధి తిరిగే యువకుల్ని, వాళ్ళను చుట్టుకొని, వాళ్ళ చుట్టూ తిరుగుతూ, సాగిపోయే పాటల్ని, మధుర శబ్దసామ్రాజ్యం పరిపాలించే ఏకైక నాయకుల్లా రాజుల్లా, యువరాజుల్లా, సమ్రాట్టుల్లా, చక్రవర్తుల్లా, మహాపోజు పెట్టే ట్రాన్సిస్టర్ సొంతదారును చూచి రాజు సరదా పడుతుండేవాడు.

ఇంట్లో రేడియో ఉండగా ట్రాన్సిస్టర్ అనవసరం అనే అనుకొనేవాడు రాజు. వినోదాలు అవసరాలుగా, అవసరాలు ఆడంబరాలుగా మారటం చూచిన రాజు రేడియోని అవసరం స్థాయిలోనే వాడు కొనేవాడు.

పిల్లలు ఎప్పుడంటే అప్పుడు రేడియో పెట్టటానికి వీలులేదు. చదువు సమయం చదువుది. ఆటల సమయం ఆటలది. పాటల సమయం పాటలది. దేనికది స్పష్టంగా టైం టేబుల్ ఉన్నట్లుగా, అలిఖితమైన ఒప్పందం లాగా రాజ్యాంగం లాగా పిల్లలు క్రమశిక్షణతో మెలిగేవాళ్ళు. వాళ్ళు ఎవరూ రేడియో పెట్టటానికి వీలుండేదికాదు. రాజునో, రాజు భార్యనో మాత్రమే రేడియో పెట్టేవాళ్లు. పిల్లలు కావాలంటే తల్లిదండ్రుల్ని అడగాలి. అంతేకానీ టకా టకా దాన్ని తిప్పటానికి వీలులేదు.

అలా పెరిగిన పిల్లల సంతానం వీళ్ళు. ఇప్పుడు వీళ్ళు రేడియో వినరు. దాని ముఖం కూడా చూడరు. టి.వి. తప్ప ఇతరం ముట్టరు. దాన్ని ఎంత కొట్టినా, ఎలా తిట్టినా, ఎటు మార్పించినా, ఏం చేసినా మహా వినయంగా, అతి దారుణంగా మాట వింటుంది. పిల్లలకు ఏ చానల్‌లో ఏం వస్తుందో, పాఠాలకంటే బాగా గుర్తు. ఒకడు ఒక చానల్ తిప్పితే, మరొకడు మరొకటి మారిస్తే, ఒకడు రిమోటు వత్తుతుంటే, మరొకడు కంట్రోలు బటన్లు నొక్కుతుంటే, టి.వి. టుక్కు టుక్కు టర్రు టుర్రు అంటూ క్షణక్షణానికో మాట మార్చే రాజకీయ నాయకుడుగా, అన్ని తాకిళ్ళుకు అన్ని వొత్తిళ్ళకు తట్టుకొని నిలబడి పనిచేస్తూ ఉంది టి.వి. దీని రాజసమే వేరు! ఇది రాజకీయ నాయకుడి కంటే కిలాడి. రాజులకంటే తుంటరి. దేవుడికంటే

మాయలమరాటి. పసిపిల్లలకంటే గోలది. పరమ వేదాంతి కంటే మోసగత్తె. పరమ కళాకారులకంటే సుకుమారి. దీని మాయలు కీలు గుర్రానికి లేవు. మాయ జలతారు దుప్పటికి లేవు. అల్లా ఉద్దీన్‌కు లేవు. అద్భుతదీపానికి లేవు. భూతానికీ లేవు. భూతం దాక్కున్న సీసాకి లేవు. ఓపెన్ ససేంకి లేవు. క్లోజ్‌ససేంకిలేవు. ఇదొక అద్భుత విశ్వం. విశ్వరహస్య ద్వారం. దీని జోలికి పోకపోవటం శ్రేయం. పోయామో మాయాజాలంలో ఇంద్రజాలంలో, సప్తసముద్రాల అవతల మంత్రాల మర్రిలో తొర్రలో దాక్కున్న చిలక గొంతులో ప్రవేశించినట్లే.

పెద్దకొడుకు తనకు తెలిసిన ప్రయోజనకరంగా నిలవధనం భద్రపరుచు కొనే మార్గం చెప్పిన తరువాత తండ్రి కూడా ఆలోచించాడు. అద్దె ఇళ్ళలో ఉండడం కంటే సొంత ఇల్లు మేలన్న యోచన ఒకటి పిల్లలు చిన్నపిల్లలుగా ఉన్నప్పుడే నెరవేరింది. నెలనెలా మిగిలే డబ్బును బేంక్‌లో ఉంచటంకంటే, బంగారం నగా నట్రా అవసరానికి మించి కొనటం కంటే, ఇళ్ళ స్థలాలు కొనుక్కోవటం మేలన్న దృష్టి ఏర్పడింది. అయితే బేంక్ లేకపోతే ఇళ్ళస్థలం, రూపంలో రాజు మిగులు ధనం భద్రంచేయసాగాడు. ఇళ్ళస్థలాల రేట్లు కాలక్రమంలో విపరీతంగా పెరిగాయి.

పిల్లలు చిన్నవాళ్ళుగా ఉన్నప్పుడు కట్టించిన ఇల్లు, చిన్నదయి పోవటంతో పెరిగిన పిల్లలకు తగినట్లుగా కట్టించిన ఇల్లు మరీ పెద్దదయి పోయింది. పిల్లలు కుటుంబాలతో ఉంటే ఇల్లు నిండుగా కళకళలాడుతూ ఉంటుంది. వాళ్ళు లేకపోతే కొన్ని గదుల్లోకి భార్యకాని భర్తకాని వారం పదిరోజులు దాకా పోకుండానే కాలం గడచిపోతుంది. ఇంత ఇల్లెందుకు మనకు అని చాలాసార్లు అనుకొన్నారు రాజు, రాజు భార్య. 'పిల్లలు వచ్చినప్పుడు ఉండడానికి' అని సర్దుకొన్నారు.

ఇంటికింద రెండు పోర్షన్లు అద్దెకిస్తే మనుషులు పిలిస్తే పలకటానికి ఉంటారని అద్దెకిచ్చారు. చిన్నప్పుడు మొదట్లో, కట్టించుకొన్న ఇల్లు అమ్మటం ఇష్టంలేకే, చిన్నచిన్న పోర్షన్లు చేసి అద్దెకిస్తే మంచి అద్దెలు రాసాగాయి. డబ్బు బేంక్‌లో పెట్టేకంటే ఇల్లు కట్టించి అద్దె కివ్వటమే మేలని రాజు పదిహేనేళ్ళ క్రితం అనుకోవటం సబబే!

నలుగురు పిల్లల పెళ్ళిళ్ళు చేయవలసి వచ్చినప్పుడు అప్పుచేయలేదు. కట్నం కానుకలు ఇవ్వలేదు కానీ, ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేసి, కాపురాలకు పంపటం ఖర్చుతో కూడిన పనే. భార్యాభర్తలిద్దరూ ఇన్‌కంటాక్స్ కట్టకుండా తప్పించుకోవటానికి పొదుపు చేసిన మొత్తం, ఇద్దరి కూతుళ్ళ పెళ్ళివయస్సు నాటికి పెద్దమొత్తాలే అయ్యాయి. ఏ ఇబ్బందీ లేకుండా వాళ్ళ పెళ్ళిళ్ళు జరిగిపోయాయి. అల్లుళ్ళు మంచి వాళ్ళు. 'అమ్మాయిల్ని మా అంత చదివించారు. మా అంత జీతాలు వస్తున్నాయి. మాకింకేం కావాలి' అని నిజంగా సంతోషించారు. పెళ్ళయిందాకా మగపిల్లలయినా, ఆడపిల్లలయినా వాళ్ళ జీతం, వాళ్ళ సొంత సంపాదన అనీ, పెళ్ళయింతర్వాత అది దంపతుల సొమ్మే ననీ, దానితో రాజుకుగానీ, అతడి భార్యక్కుగాని

సంబంధం లేదనీ వాళ్ళకు స్పష్టంగా తెలుసు. ఏ పరిస్థితుల్లోనూ వాళ్ళు తల్లిదండ్రులకు ఇవ్వకూడదు. వీళ్ళు తీసుకోకూడదు. అది అతి స్పష్టమైన నిబంధన. పెళ్ళయి పిల్లలు కలుగుతున్నప్పుడు వాళ్ళు తల్లిదండ్రుల్ని పైసా అడక్కూడదు. కానుపులు అయినప్పుడో పిల్లల్ని స్కూల్స్‌లో చేర్చినప్పుడో రాజు ఏమయినా ఖర్చు పెడితే వాళ్ళు అభ్యంతరం చెప్పకూడదు. వాళ్ళు తండ్రిని ఏమీ అడగరాదు. తండ్రీ అడగడు. బుద్ధి పుట్టి తండ్రి ఏమయినా ఖర్చుచేస్తే వాళ్ళేమీ మాట్లాడకూడదు.

పిల్లలు నలుగురూ పోయినేడు వచ్చినప్పుడు ఒక కోర్కె ప్రకటించారు. తీర్మానం చేశారు. 'మీ కిష్టమై మీరు మాకోసం ఖర్చుచేస్తే మేమేమి మాట్లాడకూడదు,. మాకిష్టమై మేం మీకోసం ఖర్చుచేస్తే మీరేమీ అనకూడదు' అన్నారు. రాజు అంగీకరించలేదు. ఒప్పుకోను అన్నాడు. అలా వీల్లేదన్నాడు.

కొడుకయినా, కూతురయినా, అమ్మయినా, నాన్నయినా, డబ్బుకోసం ఒకరి మీద మరొకరు ఆధారపడకూడదని రాజుకు స్పష్టమైన నిర్ణయం. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలేకాని, అని శాసించే స్థాయిలో ఉండరాదని, తల్లిదండ్రుల పిల్లల ప్రేమ ఆర్థికం కాకుండా ఉండాలని రాజు ఆశ. పిల్లలు తల్లిదండ్రుల్ని, తల్లిదండ్రుల పిల్లల్ని చూడడానికి డబ్బు, డబ్బు మీద ఆశ, డబ్బు వస్తుందన్న, నిరీక్షణ, నేపథ్యం పునాది, మూలసూత్రం కారాదని కచ్చితమైన నిర్ణయం. తాను ఇంతదాకా చేసిన ఇన్ని ఏర్పాట్లు నిజానికి ఈ ప్రాతిపదిక రూపాలే!

వాళ్ళిటువంటి ప్రతిపాదన చేయటానికి ఈ మధ్యకాలంలో మార్పులు కొంతకారణం. అది సామాజికంగా వచ్చిన పరిణామం. అది అనివార్యంగా వచ్చే పెద్దమార్పు!

కారు ఆగిన చప్పుడయింది. తమ కారేనని రాజు గుర్తించాడు. పెద్దకొడుకు కారు దిగి సంచులతో ఇంట్లోకి వచ్చాడు. వంటగది లోంచి పెద్ద కోడలు చేతులు పైటచెంగుకు తుడుచుకొంటూ రాలేదు. చేతులు పూర్తిగా చాపి వచ్చింది. పెద్దకొడుకు చేతుల్లో సంచులు తీసుకొంది. వంట గదిలోకి తీసుకొని పోయింది.

'ఇది పెట్రోలు రశీదు. ఈ మొత్తం మాంసం. ఈ సొమ్ము చేపలు, ఇవి కూరగాయలు, మీరిచ్చిన మొత్తం ఇది. ఖర్చులు ఇవి. మిగిలిన డబ్బు ఇది, అని చేతిలో సొమ్ముంచాడు. పర్సులో పెట్టుకోబోతే 'లెక్క చూడమ'న్నాడు.

'నువ్వెప్పుడు పైసా దుర్వినియోగం చేయలేదు. కావలసింది అడిగి తీసుకొనే వాడివి. ఇచ్చింది అణా పైసలతో లెక్కచెప్పి మిగిలింది ఇచ్చేవాడివి. నువ్వెంత మిగిలిందిఅన్నావో, అంతే మిగిలే ఉంటుంది' అంటూ ఇచ్చిన చిల్లర పర్సులో వేసుకొన్నాడు రాజు.

వంటగదిలో సామాను సర్ది, వంటమనిషికి చెప్పే పనులు పురమాయించి, పెద్దకోడలు మళ్ళీ హాల్లోకి వచ్చింది. వస్తూ 'మీ కోసమే ఆగాం టిఫిన్ ఛేద్దాం' అంది. అంటూ 'మామయ్య

ఎందుకోనొచ్చు కొంటున్నారు' అంది.

'ఏం నాన్నా?' అన్నాడు పెద్దకొడుకు

'ఏం లేదు నాన్నా' అన్నాడు రాజు, అని 'నా పర్సులో ఎవరో పదివేలు రూపాయలు పెట్టారు నాన్నా! నేను మీ డబ్బు తీసుకోనని మీకు తెలుసు కదా, తెలిసికూడా ఎందుకీ పనిచేశారో అర్థం కావటంలేదు. మీరిద్దరూ కూడబలుక్కుని ఏమయినా ఈ పనిచేశారా అని అనుకొంటున్నాను' అంటే 'అదేం మాట నాన్నా! నీకు చెప్పకుండా నీ పర్సు ముడతానా? డబ్బు తీసుకోవటానికి కాని, చిల్లర మళ్ళీ పెట్టటానికి కాని, నీకు చెప్పే చేస్తాను కాని, నీకు చెప్పకుండా చేయనుకదా!'

'అది నిజమే నాన్నా! మరి ఈ సొమ్ము ఎవరు పెట్టారు?'

'పర్సు అలమరాలోనే కదా పెడతావు. అలమారా తాళం ఎప్పటిలాగే వేయలేదా?'

'వేయలేదు'

'నేను కనుక్కొంటాను' అని లోనికి పోయాడు పెద్దకొడుకు.

పెద్దకూతురు పెద్దకొడుకును 'ఏరా తమ్ముడూ నీకేమన్నా డబ్బు ఎక్కువయితే నాకివ్వకూడదా నాన్న పర్సులో పెట్టకపోతే' అంటూ బైటికి వచ్చింది.

'అదేమాట నిన్నా బావను నేను అడుగుదామనుకొంటున్నానే తల్లి' అంటూ లోపలికి పోయాడు.

పెద్దకూతుర్ని, పెద్దకొడుకును ముచ్చటగా చూచుకొంటున్న రాజుకు వాళ్ళిద్దరూ కలిసి చిన్న కూతురుకు చేసిన సేవ గుర్తుకు వచ్చింది.

తట్టుపోసి మంచం మీంచి లేకుండా ఎక్కువ జ్వరంతో మూలుగుతున్న చెల్లిని వాళ్ళిద్దరూ మంచం చెరో పక్క చేరి మజ్జిగ పట్టించడం వేపమండలతో విసురుతూ కూర్చోవడం ఎంత ఒద్దికగానో ఉండేది. వాళ్ళ చెల్లి నిద్రపోయిందాకా సేవలు చేసేవాళ్ళు. చిన్నవాడు చాలా చిన్నవాడు కావటంతో వాణ్ణి చిన్నక్క దగ్గరకు రాకుండా ఆడుకోవటానికి పంపేసేవాళ్ళు వాళ్ళిద్దరు.

తట్టుపోసిన చిన్నమ్మాయి టవలు వేరుగా, గ్లాసు వేరుగా, ప్లేటు వేరుగా, పెట్టి వీళ్ళను దూరంగా ఉండమన్నా, దూరంగా ఉంటూనే, తగిన జాగ్రత్త తీసుకొంటూనే, చెల్లిదగ్గర చేరి కబుర్లుచెప్పేవాళ్ళు లేదంటే నిద్రపుచ్చేవాళ్ళు.

వేప ఆకు చలవ చేస్తుందని పెద్దపాప మండలు మండలు పీకించి తెచ్చి చిన్నపాప మంచం మీద వేసేది. విసనకర్ర కాకుండా వేప మండలతో మాత్రమే విసిరేది. ఫేను వేసేది కాదు.

వేసవి కాలం కావటంవల్ల అందరికీ సెలవులు అయినందువల్ల అందరూ ఇంట్లోనే ఉన్నా, పెద్ద పిల్లలిద్దరూ చిన్నపిల్లల్ని ఆడించడటం ముచ్చటగా ఉండేది. పెద్దది ఒక్కతే

పెద్దవాడి కంటే మూడేళ్ళు పెద్ద. మిగతావాళ్ళకు సంవత్సరమే తేడా. పెద్దవాళ్ళు చాలా పెద్దవాళ్ళు అయిపోయినట్లు పెద్దపోజు. ఏంచేయవచ్చో. ఏం చేయరాదో చిన్నవాళ్ళతో వీళ్ళే చెప్పేవాళ్ళు. అమ్మానాన్నల సూచనలే వాళ్ళ సొంత సూచనలు లాగా చెబుతూ ఎక్కళ్ళేని పెద్దరికం వెలగబెట్టేవాళ్ళు.

ఇంట్లో వండిన వంటకాలు అన్నీ తట్టుపోసిన చిన్నపాపకు పెట్టేవాళ్ళు కాదు. పెట్టరాదు అని అందరూ అంటుండేవాళ్ళు. హాస్పటల్‌కు కూడా తీసుకొని పోనక్కరలేదనే వాళ్ళు. అట్లమ్మ, పెద్దమ్మ, తట్టు పోస్తే ఇంగ్లీషు మందులు పనికిరావనే వాళ్ళు.అయినా రాజు ఉరుకొనేవాడు కాదు. నాటువైద్యం చేయిస్తూనే, చేయిస్తున్న వైద్యం అంతా చెప్పి డాక్టరు మందులు కూడా వాడేవాడు. రాత్రంతా బిడ్డ దగ్గరే కూర్చునేది వాళ్ళ అమ్మ. తెల్లవారితే పిల్లలు పాపదగ్గర చేరేవాళ్ళు.

తాము తింటున్నవి చెల్లికి పెట్టటంలేదని పెద్దకొడుకు పాప మంచం దగ్గరచేరి, తట్టు తగ్గిపోగానే ఏమేం పెట్టించదలచుకొన్నాడో పాపకు ఆశ కలిగేటట్లు చెప్పేవాడు. అప్పటికి తినకపోయినా ఎప్పటికయినా అవి అన్నీ తినవచ్చునని నిరీక్షించే మధురమైన అనుభూతిని చెల్లికి మిగిల్చేవాడు. ఈ హామీలు నెరవేర్చగలనని చెప్పటానికి అవన్నీ ఒక లిస్టురాసి చెల్లికి చదివించాడు. కాగితం చూపించాడు. అన్నీ తినుబండారాలే. అవి కూడా వాడికిష్టమైనవే! వాడు ఏమేమి తినాలనుకొంటాడో, అవన్నీ చెల్లికి కూడా పెట్టాలనుకొనేవాడు.

రాజు మార్కెట్టునుంచి తినటానికి ఏం తెచ్చినా నలుగురూ పేచీలు లేకుండా తినేవాళ్ళు. వాళ్ళు చాలాప్రేమగా ఉండేవాళ్ళు. ఒకరిమీద ఒకరికి ఎక్కళ్ళేని ప్రేమ. అనురాగం, అనుబంధం. అక్క చెల్లి, అన్నతమ్ముడు అని పిలుచుకోవటమేకాని, వాళ్ళను వీళ్ళు పేరుపెట్టి పిలిచేవాళ్ళు కాదు. అది వాడు అనే మాటలు కూడా ఉండేవికాదు. ఆడది అనే మాటను మగపిల్లలిద్దరూ చిన్నతనంలోనే అసహ్యించుకొనేవాళ్ళు. ఆడమనిషి, ఆడపిల్ల ఆడపాప, పాప, అక్కయ్య, అమ్మవంట మాటలే పలికే వాళ్ళు. ఆడది అనేమాట అగౌరవమైన మాటే అని వాళ్ళ నమ్మకం. వాళ్ళు అగౌరవమనుకొనే ఏమాటా మాట్లాడేవాళ్ళుకారు. తప్పు అనుకొన్న ఏ పనీ చేసేవాళ్ళుకారు. వాళ్ళ ప్రేమలు, స్నేహాలు, ఆత్మీయత చుట్టుపక్కల వాళ్ళకు ఆదర్శంగా ఉండేవి.

తట్టు పోసిన చెల్లిని ఎప్పుడూ మంచం లోనే పడుకోబెట్టడం రాజుకు ఇష్టంగా ఉండేది కాదు. బెడ్‌షీటు మార్చటానికనో, పాలకనో, పాపను ఎత్తుకొని రాజు వేపచెట్టుకింద కుర్చీలో కూర్చోబెడితే, పిల్లలు ముగ్గురూ రాజు భార్యతో సహా గిలగిల లాడుతూ చుట్టూ తిరిగేవాళ్ళు.

తట్టు అంటువ్యాధి అనీ, రాజుకీ వస్తే తాము భరించలేమని అందరూ హెచ్చరించటమే ఆ గోల. చెల్లిని ఎత్తుకోవద్దు నాన్నా, దించునాన్నా పడుకో బెట్టు నాన్నా అంటే గోలపెట్టే వాళ్ళు.

'మీరెవరూ పాపను తాకకూడదు. కానీ దగ్గరగా ఉండాలి. ప్రేమగా చూచుకోవాలి.

నేను తాకవచ్చు. ఎందుకంటే, పెద్ద వాణ్ణి కదా, తాకవచ్చు. చిన్నపిల్లలకు అంటువ్యాధులు వచ్చినట్లు పెద్దవాళ్ళకు రావు' అని పిల్లలతో చెబితే అపనమ్మకంగానే తలవూపేవాళ్ళు.

పాపను పడుకోబెట్టిన తరువాత భార్య రాజును బట్టలు మార్పించేది. స్నానం చేయించేది. ఉదకబెట్టేది. ఇస్త్రీ బట్టలు వేయించేది. ఇన్నీ చూచి పిల్లలు కొంచెం కుదుటపడేవాళ్ళు. భయపడే భార్యతో రాజు చెప్పాడు.

పాప ఎంతసేపు మంచం మీద పడుకొని ఉంటుంది. గాలిమార్పు మంచిదేకదా, నన్నెవరూ తాకటం లేదనే భావం కలిగితే పాప భరించగలదా. తాను భరించలేకుండా ఉందన్న ఊహ నేను తట్టుకోగలనా? తండ్రి చేతి స్పర్శ, జబ్బుచేసిన బిడ్డకు, ఎంతో అవసరం. ఈ స్పర్శ ఒక ఓదార్పును ఊరటను కలిగిస్తుంది. నేనంటే మా అమ్మానాన్నలకు ఎంతో ఇష్టం. ఎంతోప్రేమ, ఎంతో ముఖ్యం, ఎంతో ప్రాధాన్యం అనుకొంటే బిడ్డ కెంత ఆత్మవిశ్వాసం. నేను వీళ్ళకు కావాలి. అవసరం. అత్యవసరం. అన్న అభిప్రాయం నుంచి నేను బ్రతకాలి. బ్రతుకుతాను అన్న దృష్టి, ఆరాటం పోరాటం బయలుదేరుతాయి. నేను వీళ్ళకు అక్కరలేదనుకొన్న బిడ్డ బ్రతకటానికి పోరాటం చేయలేదు. అవసరం అనుకొన్న బిడ్డ పోరాడుతుంది. పెద్ద యుద్ధమే చేస్తుంది. మానవ శరీరానికి, ప్రకృతి సహజమైన వ్యాధినిరోధక శక్తితోపాటు మానసిక చైతన్యం విశేషమైన పోరాటం చేస్తుంది. చెట్టుకిందికి తీసుకొని పోయినప్పుడు బిడ్డ ముఖంలో ఎంత వికాసం, ఎంతకళ, ఎంత చైతన్యం ఆనందం వెల్లివిరుస్తాయో చూశావా? ఆ ముఖం చూచే అదృష్టం కోసం బిడ్డను ఎత్తుకోవాలి.

అమ్మానాన్నలు మమ్మల్ని బాగా చూచుకొంటారన్న నమ్మకం వల్ల. వాళ్ళకు తమ మీద తమకు విశ్వాసం పెరుగుతుంది. తల్లిదండ్రుల మాట కాదనరు. చెబుతున్న పని చేస్తారు. ఉండమన్న చోట ఉంటారు. వాళ్ళ మేలు కోసమే తల్లిదండ్రులు ఏమయినా చేస్తారన్న నమ్మకం పిల్లలకు కలగడం చాలా అవసరం.

పిల్లలు పెరిగి, పెద్దవాళ్ళయి, పెద్ద చదువులు చదివి, పెద్ద ఉద్యోగాలలో చేరి, జీవితం చూచిం తర్వాత కూడా వాళ్ళ పెళ్ళిళ్ళ విషయంలో చెప్పినట్లు విన్నారు. కట్టమన్నవాళ్ళకు తాళికట్టారు. తాళి కట్టించుకోమన్నవాళ్ళతో కట్టించుకున్నారు. సుఖశాంతులతో జీవిస్తున్నారు. మాట పొరపాటులు లేవు. మనస్సులు కలిసిన జీవితం ఎంత అద్భుతవరం.

పెళ్ళయి ఇన్నేళ్ళయినా, కొడుకులు కూతుళ్ళు మాత్రమే కాదు. అల్లుళ్ళు కోడళ్ళు కూడా తామేం చేయదలచుకొన్నా, ఇప్పటికి చెబుతారు, సలహా తీసుకుంటారు. పాటిస్తారు. వాళ్ళు సక్రమమే అనుకొన్న దానికూడా వద్దంటే మానతారు. వాళ్ళు బాగా లేవన్న పనిని కూడా పర్వాలేదు చేయండి అంటే చేస్తారు. తల్లిదండ్రులమీద అంత ప్రేమగా పిల్లలుండటం పెద్దవాళ్ళకు వరమే కాదు. పిల్లలకు కూడా అదృష్టం.

పెద్దకూతురు పోయి చిన్నకూతుర్ని నిద్రలేపింది. మరిదిని మాట్లాడించకుండా కూతుర్ని

కొడుకునూ ఆడిస్తూ చెల్లిని లేపింది. కళ్ళు నులుముకుంటూ లేచి బైటికి వచ్చింది. 'ఏం తల్లీ ఏందీ మొద్దునిద్ర' అని అక్క పరామర్శిస్తే 'రాత్రంతా ప్రయాణం పిల్లలతో గోల నిద్రలేదు. కుదుపులు వొళ్ళు నొప్పులు, తీరుబడిగా ఆవులిస్తూ ఒక్కొక్క మాట చెబుతూ సొదంతా వెళ్ళబోసుకుంది.

'మీకంటే మీ పిల్లలు నయం. మీకంటే ముందే నిద్రలేచారు' అంది అక్క.

'నయం. లేవకేం చేస్తారు. రాత్రంతా ఒకటే గుర్రు పెట్టారు. రైలు ప్రయాణం వాళ్ళకు ఉయ్యాల ఊపినట్లుగా ఉంది. సుఖంగానిద్రపోయారు. ఇంకేం ముందుగానే లేస్తారు. మమ్మల్నీ లేపుతారు.'

'వాళ్ళు కాదే తల్లీ. నేను లేపాను'

'ఉండు వస్తాను' బాత్‌రూంలోకి పోయింది.

డ్రైవర్, నేను స్టేషన్‌కు వెళతానన్నా, కాదని, రాజు కూడా రాత్రి స్టేషన్‌కు వెళ్ళి వాళ్ళనురిసీవ్‌చేసుకొన్నాడు. తెల్లవారుజామున కూడా పిల్లలు మగతలో లేరు. హుషారుగా ఉన్నారు. రైలు దిగగానే చిన్నవాడు ఎత్తుకోమని చేతులు చాపాడు. భుజం మీద వేసుకొంటే నిద్రపోకుండా ముఖంలో చూడసాగాడు. పాప చేయి పట్టుకొంది. రాజు వాళ్ళతోపాటు బైటికి వస్తే వాళ్ళ సామానుతో కూలీలతో వాళ్ళ గోల వాళ్ళు పడి కారు దగ్గరకు వచ్చారు.

వాళ్ళు థర్డ్ ఏసిలో వచ్చారు. పెద్దకూతురు కుటుంబంతో మొన్న సెకెండ్ ఏసిలో వచ్చింది. చిన్నకొడుకు చిన్నపిల్లలు ఇద్దరితో టాక్సీలో వచ్చాడు. పెద్దకొడుకు తన కారులో తనే డ్రైవ్ చేసుకొంటూ వచ్చాడు. వాళ్ళను కార్లలో ప్రయాణం చేయవద్దని తాను చెబుతూనే ఉంటాడు. పెద్దల్లుడు కారున్నా, కార్లో రాడు. పెద్దకొడుకు 'తప్పనిసరయి వచ్చాను. ఈసారి అలా రావని' వాగ్దానం చేశాడు. చిన్నకొడుకును కష్టమోసుఖమో రైల్లోనే రమ్మంటే సరేనంటూ తలవూపాడు.

రిటైరు అయింతర్వాత రాజుకు కారు వచ్చింది. కానీ, వీళ్ళలో ఇద్దరికి అప్పుడే సొంత కార్లు ఒనగూడాయి. అందరికీ సొంత ఇళ్ళు ఏర్పడ్డాయి. చిన్నతండ్రిని ఇళ్ళస్థలం కొనుక్కోమంటే కొనుక్కొన్నాడు.

రాజు తన జీవితంలో చాలా భాగం రైల్లో జనరల్ కంపార్టుమెంటులోనే ప్రయాణం చేశాడు. స్లీపర్‌లో ప్రయాణం ఒకనాడు తనకు లగ్జరీ. ఉద్యోగం మూలాన ఊపిరాడని ఏసి కంపార్టుమెంటుల్లో ప్రయాణం చేసినా స్లీపరే తన కిష్టం. ఈమధ్యపిల్లలు కనీసం థర్డ్ ఏసిలోనైనా ప్రయాణం చేయమని గోలపెడుతున్నారు.

ఫస్ట్‌ఫారం నుంచి స్కూలు ఫైనల్ దాకా తాను రానూ పోనూ రైల్లోనే ప్రయాణం చేశాడు. పొద్దునే ఆరుగంటలకు పాలబండి. ఎనిమిది మైళ్ళు. అరగంట ప్రయాణం లంఖనాల. బోటు అనేవాళ్ళు ఆ రైలుని. ఉత్సాహవంతులు రైల్లోంచి దిగి అది పోతూ ఉండగానే చేలల్లో

వేరుసెనక్కాయ మండలు లాక్కొచ్చి రైలెక్కి పీక్కుతింటుండే వాళ్ళు. అంత స్పీడుగా పోవటం రావటం దాని రివాజు. ఆరోజుల్లోనే రాజుకు పోతుండగా రైల్లోంచి దిగటం ఎక్కడం అలవాటు అయింది. ఇప్పటికీ ఎప్పుడైనా పోతుండగా ఎక్కుదామనో, దిగుదామనో అనిపిస్తుంది. వయస్సు అడ్డంవచ్చి వద్దనుకొంటున్నాడు కాని పెద్దరికం లెక్కపెట్టేవాడు కాదు.

నిద్రమొహంతో రైలెక్కేవాడు. నిద్రముఖంతో రైలు దిగేవాడు. ఐదుగంటలకు ఉదయం నిద్రలేచేవాడు. రాత్రి ఎనిమిది గంటలకు ఇంటికి చేరేవాడు. రైల్లో నిద్రపట్టేది. ఎవరైనా లేపితే స్కూలుకు పోవటం లేకపోతే షటిల్ తిరిగే రైల్లోనే నిద్రపోతూనే ఉండేవాడు. రైలుపెట్టెలో నిద్ర తల్లి ఒడిలో నిద్రలాగా ఉండేది. కుదుపు సుఖంగా ఉండేది.

రైలు ప్రయాణంలో జనరల్ కంపార్టుమెంటు తనకు చాలా ఇష్టం. ఇక ఏ కంపార్టుమెంటు ఎక్కినా ఇరుగుపొరుగు వాళ్ళ ఇళ్ళలో ఉన్నట్లు ఉంటుంది.

చిన్నతనంలో రైలు తమ సొంతం అనుకొనేవాడు రాజు. తమ కోసం రైలు వేశారనుకొనేవాడు. తామెక్కకపోతే రైలుకు దిక్కులేదనుకొనేవాడు. స్కూలులో పిల్లల్లాగా, కుర్చీల్లాగా, మాష్టార్లు పాఠం చెప్పటంలాగా, పొడుగ్గా ఉన్న వరండాలాగా, అన్నీ తమ కోసమే, తమ సొంతమే తమవే అనుకొంటున్నట్లు రైలు తనకు హక్కు భుక్తంగా ధారాదత్తమయినట్లు పట్టారాసిచ్చినట్లు భావించేవాడు.

అందుకే రైలుకు టిక్కెట్టు తీసుకొనే వాళ్ళు కాదు స్కూలు పిల్లలు. టిక్కెట్టు కొనటం అవమానంగా భావించేవాళ్ళు వాళ్లు. హక్కు భంగపడ్డట్టుగా ఉండేది. క్లాసులోంచి వెళ్లగొట్టినట్లు అనిపించేది. చెక్కింగు వచ్చిన టిటియిలు పట్టుకుపోయి పోలీసుస్టేషన్లో పెట్టి, ఫైన్ కట్టించుకొని, కట్టనివాళ్ళను జైలుకు పంపుతున్న సందర్భంలో రైలుని ఎవరో తమ సంచుల్లోంచి, చేతుల్లోంచి కాళ్ల దగ్గర్నుంచి లాక్కుపోయినట్లు బాధ. లాక్కుపోతారన్న దుఃఖం తప్పదన్న వ్యధ చాలాకాలం వేదించింది. ఇప్పటికీ తమ పల్లె కెళ్ళే రైలు ఎక్కుతుంటే టిక్కెట్టు కొనడం తప్పయినట్లు, అయినా తప్పనిసరిగా తప్పుచేస్తున్నట్లు భావిస్తాడు రాజు.

అట్లాంటి రైలులో జనరల్ కంపార్టుమెంటు సుఖం వదిలిపెట్టి, స్లీపర్ లగ్జరీ విడిచిపెట్టి, ఊపిరాడని ఏసిలో వీళ్ళు ప్రయాణం చేయటమే కాదు తమనూ ప్రయాణం చేయమని సతాయిస్తుంటే, ఏం మారిందో, ఎలా మారిందో, ఎందుకు మారిందో అర్థంకావటం లేదు.

పిల్లలు వస్తుంటే వాళ్ళున్నంతకాలం ఎంతో కొంత ఖర్చు, అదనంగా ఖర్చు, అవుతుంది. అందుకు తాను సిద్ధంగానే ఉండేవాడు. పిల్లలు సకుటుంబంగా వచ్చి వెళుతున్నప్పుడు వాళ్ళ తిరుగుప్రయాణానికి స్లీపర్ టిక్కెట్లు తాను తీసి ఇచ్చేవాడు.

వాళ్ళు స్లీపర్‌లో ప్రయాణం చేయడం ఇష్టంలేక రాజు చేత ఎసి టిక్కెట్టు కొనిపించలేక ముందుగానే తిరుగు ప్రయాణానికి టిక్కెట్లు కొనుక్కొని మరీ వస్తున్నారు. పెద్దకొడుకు వచ్చిన కారులోనే వెళతాం! టిక్కెట్లు అక్కలేదంటున్నాడు. నాఫ్రెండ్ కారు ఉంది. దాంట్లో

వెళతానని చిన్నకొడుకు అన్నాడు. సారాంశం ఏమిటంటే వాళ్ళు తల్లిదండ్రుల్ని ఖర్చు పెట్టించకూడదని నిర్ణయించుకొన్నట్లు స్పష్టమయింది.

అంతకుముందు సంవత్సరం వాళ్లకు రాజు కొని యిచ్చిన స్లీపర్ టిక్కెట్టు కాన్సిల్ చేయించి ఏసి టిక్కెట్టు కొనుక్కొని వాళ్లు ప్రయాణం చేశారు. దానికి సంజాయిషీకూడా ఇచ్చారు. 'చిన్నపిల్లలతో ప్రయాణం వాళ్ళు మీ మనమళ్ళు, మనుమరాళ్ళు. వాళ్ళు సుఖంగా ప్రయాణం చేయాలి కదా. వాళ్ళకంటే మాకేంకావాలి. మేం సంపాధించేది వాళ్ల కోసమే కదా మా సుఖసంతోషాలు మీరు చూచినట్టు వాళ్ళ సుఖసంతోషాలు మేం చూడాలి కదా'

రాజు ఏమీ మాట్లాడలేకపోయాడు.

చిన్నల్లుడు చిన్నకూతురు కలిసి వచ్చి హాల్లో అన్ని పేపర్లూ ముందేసుకొని కూర్చున్నాడు.

రాజు నెమ్మదిగా వాళ్ల దగ్గరగా చేరి ఆ కబుర్లు ఈ కబుర్లు చెప్పి, 'తెల్లవారుజామున, నేను పడుకొన్న తరువాత మీ యిద్దరూ కలిసి నా పర్సులో పదివేలు పెట్టారు కదా' అని అన్నాడు.

'పదివేలా?' ప్రశ్నించింది చిన్నకూతురు. 'మేమా?' అడిగింది. 'డబ్బా!' అంది. 'మాకేం తెలుసు' అంటూ 'మీరే బెంక్ నుంచి డబ్బు మా ఖర్చు కోసమని తెచ్చి, తెచ్చిన విషయం మర్చిపోయి ఉంటారు నాన్నా' తేల్చి చెప్పింది.

నలుగురు పిల్లలు అల్లుళ్ళు కోడళ్ళతో సహా ఆ పదివేలు తమకు తెలియదంటే తమకు తెలియదని నమ్మకంగా చెబుతున్నారు. కూడబలుక్కొని చెబుతున్నారు. అందరూ విశ్వసింపదగినట్లుగానే చెబుతున్నారు. ఎవరి మాటనమ్మాలి? అబద్ధం ఆడే పిల్లలు కారు.

తాను చాలా పెద్ద ఉద్యోగం చేసి; పదవీ విరమణ అరవై రెండో ఏట చేసినా, తన చిన్న ఉద్యోగానికి వచ్చిన. జీతం మీద ఆధారపడి పెన్షన్ ఇచ్చారు. ఈ పెన్షన్ తన చివరి జీతంలో మూడోవంతు కూడా లేదు.

అందుకుగాను సిద్ధమయ్యే ఉన్నాడు. ఇళ్ళమీద వచ్చే అద్దె, పోస్టాఫీసులో బేంక్‌లో ఉన్న డిపాజిట్టులు మీదా వచ్చే వడ్డీ, తన పెన్షన్ కలుపుకొంటే దాదాపు తన చివరి నెల జీతమంత అవుతుంది కాబట్టి, తాను రిటైరు అయినా దైన్యం లేకుండా ఉద్యోగంలో ఉన్నట్లే బ్రతకవచ్చని, పెట్టుపోతలు జరపవచ్చని, రాకపోకలు ఉండవచ్చని, ఎవరిమీదా ఆధారపడకుండా బ్రతకవచ్చని పిల్లల్ని ప్రేమగా వాళ్ళకు కావలసింది, తనకు సాధ్యమయినంత వరకు అందిస్తూ ఆదరంగా చూడవచ్చుననీ అనుకొన్నాడు రాజు. అక్కడే పొరపాటు జరిగింది. అంచనాలన్నీ తలకిందులయ్యాయి.

రిటైరు అయినాక చివరి నెలలో తీసుకొన్నంత జీతంతో దాదాపు సమానంగా తన మొత్తం రాబడి ఉంటుందనుకొంటూ వచ్చిన రాజుకు అందులో కనీసం సగం కూడా

రావటంలేదు.

ఆ ఏర్పాటు రాష్ట్రప్రభుత్వం ప్రపంచబేంక్‌తో చేసుకొన్న ఒప్పందం ఫలితం. ఐదేళ్లమంది, సంవత్సరానికి రెండుసార్లు ఇచ్చే డిఏ పెంపుదల ఆగిపోయింది. పించన్‌దార్లు వస్తుందనుకొన్న రిలీఫ్ రాకుండా పోయింది. ఆవిధంగా రాజు అనుకొన్నంత రాబడి లేకుండా పోయింది.

సరళీకరణం, ప్రపంచీకరణంలో భాగంగా వడ్డీరేట్లు సగానికి సగం తగ్గిపోయాయి. మునుపు వంద రూపాయల వడ్డీ వస్తుందనుకొన్నచోట ఏభైరూపాయలయింది. జీవితమంతా ఒక జీతంతో బతికి, ఆదా చేసిన ఒక జీతం ఎంతో వడ్డీ ఆర్జించి పెడుతుందనుకొంటే గొర్రెతోక వడ్డీ తెస్తూ ఉంది.

రాజు ముందు కట్టించుకొన్న ఇల్లు అయిదు పోర్షన్లు చేసి అద్దెకిచ్చాడు. సరళీకరణంలో భాగంగా బేంక్ అప్పులు అడిగడిగి ఇవ్వటంతో ఏమాత్రం స్తోమతు ఉన్న ఉద్యోగి అయినా సొంత ఇల్లు కట్టించుకొన్నాడు. అద్దెకు చేరేవాళ్ళు తగ్గిపోసాగాడు. అద్దె ఇళ్ళు ఖాళీ కాసాగాయి.

రాజు ఉన్న ఇంటికింది రెండు పోర్షన్లు ముందట ఇల్లు అయిదు పోర్షను అయిదేళ్ళ నుంచి చాలా సమయం ఖాళీగా ఉంటున్నాయి. అంతకుముందు ఏడాదికి రెండేళ్ళకు అద్దెలు పెంచేవాడు. ఇప్పుడు పెంచటం లేదు. ఎవరూ చేరకుండా ఉంటే అద్దెలు తగ్గించసాగాడు. ఆవిధంగా అద్దెలమీద వచ్చే రాబడి సగానికి సగం తగ్గిపోయింది.

రిటైరు అయింతర్వాత తన దగ్గర నెలకింత డబ్బుంటుందని అంచనా వేసుకొన్న రాజు ఆదాయం అందులో సగానికి పడిపోయింది. ఆ సగంతో తనిప్పుడు సంసారం ఈదవలసి వస్తూ ఉంది.

మామూలుగా అయితే ఆ డబ్బు బ్రతుకు దెరువుకు ఫర్వాలేదు. సరిపోతుంది. కానీ ఇంతకాలం గడిపిన జీవితం ఉద్యోగానికి ఉన్న అధికారం అహంకారం తెచ్చిన ఖర్చులు భరించటానికీ పెన్షన్ చాలటం లేదు.

ఈ పరిస్థితుల్లో తన పిల్లలకు సెలవులకు వచ్చినప్పుడు ఖర్చులు, వాళ్ల రాకపోకల ఖర్చులు, పిల్లలకు బట్టలు, బొమ్మలు ఆట వస్తువులు వంటివాటి ఖర్చులు ఎదుర్కొనటానికి తన డబ్బు చాలటంలేదు.

తాను చేయాలనుకొన్న ఖర్చులు చేయలేకపోతే తనకు దిగులు. దిగులు అశక్తతవల్ల కలుగుతుంది. అశక్తత ఆత్మన్యూనతను ఆపాదిస్తుంది. అది మనిషిని క్రుంగదీస్తుంది. లొంగదీస్తుంది. తనకు తాను ఏర్పరచుకొన్న నైతిక సూత్రాలను తెంచుతుంది. మనిషి వ్యక్తిత్వానికి బలమైన పునాదులుగా ఉండే నైతికసూత్రాలు తెగిపోతే మనిషి చలనసూత్రాలు ఉండ చుట్టుకొని పోతాయి. జీవితాంతం నిటారుగా తలెత్తుకొని నిలబడ్డ మనిషి తలవంచుకోవలసి వస్తుంది. ఇచ్చిన చేయి పుచ్చుకొనే చేయిగా మారుతుంది. నైతికంగా

పుచ్చుకొన్నా, పుచ్చుకొనే వాడు ఇచ్చేవాడికి లోకువే. ఇచ్చేవాళ్ళు కన్నబిడ్డలే అయినా ఇంతకాలం పుచ్చుకొన్న వాళ్లు ఇక ఇచ్చేవాళ్లు అవుతున్నారు. ఇంతకాలం ఇచ్చినవాడు ఇప్పుడు పుచ్చుకొనే వాడు అవుతున్నాడు. వాళ్లు ఏమీ అనుకోకపోయినా తాను ఏమయినా అనుకొంటాడు. నైతికంగా పుచ్చుకొన్నంత కాలం పుచ్చుకోవటం బాగుండవచ్చు అది అనైతికంగా మారితే అనాచారమవుతుంది. దయనీయమవుతుంది. దైన్యం సంపాదిస్తుంది. దైన్యం లేని జీవనం అసాధ్యమవుతుంది. ఆస్థితి రాకూడదని రాజు ఆలోచన, ఆశ, నిరీక్షణ, అది నిష్ఫల మవుతూ ఉంది.

పిల్లలు ఎవరు పెట్టినా రాజు పర్సులో పదివేలు పెట్టి అతడి అశక్తతను గుర్తించారు. గుర్తించామని చెప్పారు. అది తనకు హెచ్చరికగా ఉంది. చిరిగిన బనీను వేసుకొని డాబుగా తిరుగుతున్న వాడిని నీ బనీను చిరిగిందని చెప్పినట్లు అయింది.

ఇంతకాలం ప్రేమగా, ఆదరంగా, ఆత్మీయంగా తాను ఆర్జించుకున్న ఇచ్చేవాడి హోదా, పెట్టి పోషించే వాడి దర్జా, కాపాడి సంరక్షించేవాడి అంతస్థు కూలిపోతున్నట్లు అనిపించసాగింది. లేమికన్న, ఆలేమి నలుగురికి తెలియడం చాలా బాధాకరం. తనకు ఇబ్బంది ఉందని తనకు తెలియడం వేరు. పిల్లలకు కూడా తెలియడం వేరు. అప్పుచేయరాదు, ఉన్న ఆస్తులు అమ్మరాదు, అనితనకు కఠోర నియమాలున్నాయి.

రాష్ట్రప్రభుత్వం అప్పులు తెస్తూ ఉంది. దానివల్ల ఏర్పడవలసి ఉన్న కామధేనువులు, కల్పవృక్షాలు కనిపించటంలేదు. ఆ అప్పురాష్ట్రంలో ఉత్పత్తిని పెంచి, ప్రజల ఆదాయం పెంచే స్థితి ఉండాలి. అలా జరగటంలేదు.

అప్పు తెచ్చిన మొత్తం బడ్జెట్‌లో భాగం కాదు. ప్రజల పర్మిషన్‌ఉండదు. దానికి కేబినెట్ ఆమోదం ఉండదు. అసెంబ్లీ ఆమోదం ఉండదు. కాని దాని వడ్డీ మాత్రం బడ్జెట్‌లో ఖర్చు పద్దులో కనిపిస్తుంది. తెచ్చిన అప్పు సంక్షేమ కార్యక్రమాలలో కనపడకుండా పోతుంది. అప్పు మిగులుతుంది. వడ్డీ చెల్లిస్తూ ఉండాలి. అందుకు మళ్ళీ అప్పు తేవాలి. ఒక దశలో వడ్డీ చెల్లించటానికే అప్పుతేవాలి. పదేళ్ళలో తెచ్చిన అప్పులు పాతికేళ్ళలో కూడా తీరటం కష్టం. మళ్ళీ అప్పులేకుండా వడ్డీ కట్టగలిగితే గొప్ప.

రాజుకు అప్పుతెచ్చుకోవటం ఏమాత్రం ఇష్టం ఉండదు. అప్పు తెచ్చుకొని పప్పుకూడు తినటం తనకసహ్యం. కూడు లేకుండా ఉన్నా న్యాయమే కాని అప్పు చేసి అన్నం తినటం, అన్నం తినటానికి అప్పుచేయటం, పిల్లలు చదువుకు కాదు, పెళ్ళిళ్ళకు కాదు, పండుగలకు పబ్బాలకు కాదు, ఊరికే అన్నం తినడానికి, అన్నానికి అప్పులు చేయటం రాజు భరించలేదు. కానీ ఏంచేయాలి? పిల్లలు, పిల్లల పిల్లలు, వాళ్ళ జీవితాంతం తాము చేయని అప్పులు, తమకు నిమిత్తం లేని అప్పులు తీర్చవలసి ఉంటుంది. ఎనిమిది కోట్లమంది ఆంధ్రులు ఈ అప్పులు తీర్చటానికి పది కొట్లుకావాలి. అయినా అప్పుతీరదు. అభివృద్ధి ఉండదు.

కాగితాల మీద ఆంధ్ర రాష్ట్రం స్వర్ణాంధ్రం అవుతుంది. భారతదేశం వెలిగిపోతుంది. దేశం అప్పుల్లో పీకలదాకా మునిగి ఊపిరి ఆడకుండా ఉంటుంది.

రాజు అప్పులు చేయలేదు. పిల్లల్ని అప్పులు చేయవద్దని హెచ్చరించాడు. కానీ అప్పు చేయకుండా ఇళ్ళస్థలాలు కొనుక్కొన్న వీళ్ళు, ఇళ్ళు కట్టించుకోవడానికి మాత్రం ఎంతోకొంత అప్పులు చేశారు. 'ఇప్పుడు మేం తీసుకొన్న అప్పు విలువకంటే మేం తీర్చేనాటికి అయిన మొత్తం విలువ తక్కువ' అని చెప్పారు. నేటి పదిలక్షలు, తాము అప్పుతీర్చేనాటికి, వడ్డీతో అసలు కలిపి ఇరవైలక్షల కంటే ఎక్కువే అయినా, ఆ మొత్తం విలువ తాము తీసుకొన్న సొమ్ము విలువకంటే తక్కువే! సమస్యలు లేకుండా తీర్చే సామర్థ్యం ఉంటే అప్పుచేయటం తప్పుకాకపోగా ఒప్పు, లాభం, మేలు. రాజు కాదనలేక పోయాడుకానీ, ప్రభుత్వం, బేంకులు ఎక్కువ విలువ ఇచ్చి తక్కువ విలువ తిరిగి తీసుకొంటుంటే దేశ ఆర్థికపరిస్థితి తప్పక దివాళా తీస్తుంది.

దీన్ని ఎవరు కాపాడాలి? ప్రభుత్వం! ప్రభుత్వం దృష్టి ఎలా ఉంది? ఐదేళ్ళు పబ్బం గడుపుకోవటం! ప్రజలేం చేస్తున్నారు? నిద్రపోతున్నారు! ఎప్పుడు మేల్కొంటారు? కొంచెం సమయం పడుతుంది. అప్పుడేమవుతుంది? అప్పులకల్తీతో జీవితం కలుషితమై ఊపిరి ఆడక జనం అటూ ఇటూ అవుతుంటారు.

'నాన్నా' అంది పెద్దకూతురు. 'ఏం తల్లీ!' అన్నాడు. 'ఏంటి ఆలోచిస్తున్నావు!' అనడిగింది. 'ఏమీ లేదు. మీ భవిష్యత్తు గురించే' అంటూ బదులు చెప్పాడు.

'మా భవిష్యత్తుకేం నాన్నా, బంగారం లాంటి పునాదులు వేశావు. మాకేం భయంలేదు.'

'ప్రజలందరికీ బంగారు భవిష్యత్తు ఉండవద్దుమరి?'

'ఉండాలి'

'దాన్ని ఎవరు ఆలోచించాలి?'

'వాళ్ళ తల్లిదండ్రులు'

'ఈ తల్లిదండ్రుల్ని?'

'వాళ్ళ తల్లిదండ్రులు - అంటే ప్రభుత్వం.'

'ప్రభుత్వం ఏం చేస్తూ ఉంది? ప్రభుత్వమంటే ఎవరు? ప్రజలు నియమించుకొన్న కూలీల, జీతగాళ్ళ పనివాళ్ళు. సమూహం సేవకుల పెత్తనం ఎవరిది? ప్రజలది! రౌతుమెత్తనైతే గుర్రం ఉడాయిస్తుంది, దబాయిస్తుంది, దౌర్జన్యం చేస్తుంది, నతాయిస్తుంది, సంపాదించుకొంటుంది, పెద్దకూతురు ఏమీ మాట్లాడకుండా అయిపోయింది.

అందరూ హాలులోకి వచ్చారు. అందుబాటులో ఉన్న చోట్లల్లో కూర్చున్నారు. సోఫా నిండిపోయింది. ఎడంగా ఉన్న డైనింగ్ టేబిల్ కుర్చీలు నిండిపోయాయి. పిల్లలు ప్లాస్టిక్కు

కుర్చీలు తెచ్చి వేసుకొన్నారు. రాజు గుర్తించాడు. అసెంబ్లీ ఏర్పాటు అయింది. సమావేశాలు జరుగుతాయి. వాదోపవాదాలుంటాయి. అందరూ రూలింగ్ పార్టీవాళ్ళుగా ఉన్నారు. తనొక్కడే అపోజిషన్ పార్టీగా అనిపించాడు.

'ఇప్పుడు ప్రభుత్వం మేమే నాన్నా' అన్నాడు పెద్దకొడుకు. 'అవు'నన్నాడు చిన్నకొడుకు. 'నిజమే' అంది పెద్దకూతురు. 'కాదామరి?' అంది చిన్నకూతురు. మిగతా వాళ్లు గొప్పగా తలలూపారు. మన ఎమ్మెల్యేలు చేతులెత్తినట్లే వాళ్లు తలలూపటం. చిన్నకోడలి భుజంమీద భరతనాట్యం ప్రాక్టీసు చేస్తున్న మనుమరాలు 'అవును తాతా' అంది. ఏమౌనో?

చిన్నదాన్ని దగ్గరకు తీసుకొన్నాడు రాజు. 'ఏమౌనే టక్కరిముక్కా' అని అడిగాడు. 'అంతా అవును. అమ్మ అవును. నాన్న అవును' అంది. పాపకింకా రెండేళ్ళు నిండలేదు. తల్లిదండ్రుల సంప్రదింపులు బాగా విన్నట్లుగా ఉంది.

'అంటే నాన్నా, ప్రభుత్వంలాగా మేం మిమ్మల్ని అంటే మాతల్లిదండ్రుల్ని చూసుకొంటామన్నమాట'

'అది కాదు నాన్నా' అన్నాడు రాజు.

'మరేం చెప్పొద్దు నాన్నా' అన్నాడు చిన్నకొడుకు.

అంతా మౌనంగా కూర్చున్నారు.

చిన్నకూతురు వచ్చి సోఫా హెండ్ మీద కూర్చుని తండ్రి షర్టు బటను సర్దుతూ 'నాన్నా నువ్వు అన్నీ తెలిసినవాడివి. నీకు లేకపోయినందువల్ల మేం నీకు ఏమీ ఇవ్వటంలేదు'

'ఇప్పుడు నా దగ్గర డబ్బులేదనే కద తల్లీ మీరంతా కూడబలుక్కుని డబ్బు ఇచ్చారూ?' అన్నాడు రాజు.

'మీ దగ్గర డబ్బెందుకు లేదు నాన్నా! ఇళ్ళున్నాయి ఇళ్ళస్థలాలున్నాయి. ఫిక్స్డ్ డిపాజిట్లున్నాయి. అవేమీ మీరు కదపటం లేదు కాబట్టి మీ దగ్గర డబ్బులేదనుకొంటున్నారు. అవి వాడదలచుకొంటే మీకేం కొదవ!'

'అవి వాడితే ఎంతకాలం వస్తాయి. మేం ఎంతకాలం జీవించగలమని భావించుకొని వాటిని వాడటం ప్రారంభించాలి? అమ్మటం ప్రారంభిస్తే అంతెక్కడ? ఎన్నని అమ్మటం? సంపాదించాలికానీ అమ్మటం ఏమిటి? రేపు అత్యవసరమయితే ఏమి దిక్కు? ఉన్న ఆస్తుల్ని ఇళ్ళస్థలాల్ని పొలాలను ప్రమాద పరిస్థితుల్లో తప్ప అమ్ముకొంటూ పోవడం, తినటానికి బ్రతకటానికి అమ్మటం కంటే దౌర్భాగ్యం నీచం ఉండవు.'

అందరూ మౌనంగా కూర్చున్నారు. రాజు సాధారణంగా కోపం తెచ్చుకోడు. కానీ కచ్చితంగా నిక్కచ్చిగా ఉంటాడు. ఒకసారి ఒక మాటంటే వెనక్కు పోడు.

పెద్దకూతురు గ్లాసుతో నీళ్ళు తెచ్చి తండ్రికి ఇచ్చింది. చిన్నతనం నుంచి తండ్రికి

ఎప్పుడు ఏంకావాలో అది గ్రహించటంలో అందించటంలో చాలా నేర్పరి.

తండ్రికి అప్పుడు నిజంగా దాహం అయింది. నీళ్లు తాగాడు. 'థాంక్స్ తల్లి' అన్నాడు.

'నాన్నా' అంది సోఫాలో పక్కనే కూర్చుంటూ 'ఏం తల్లీ' అన్నాడు. 'మమ్మల్ని ఎందుకు కన్నారు మీరు' బిత్తరపోయి ముఖంలోకి చూస్తూ 'మీ అమ్మను అడుగు' అన్నాడు.

'నేనేం చెబుతానండి. బాగుంది మీ వరస'

'మమ్మల్ని ఇంత క్రమశిక్షణ, ఇంత సక్రమంగా ఇంత సమగ్రంగా, సమర్ధంగా, సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం కలిగేట్లు ఎందుకు పెంచారు?'

'మా బాధ్యత!'

'పిల్లలకు అన్నివిధాల అభివృద్ధి క్షేమం సౌఖ్యం కోరటం తల్లిదండ్రుల బాధ్యత కదా నాన్నా'

'అవును తల్లి!'

'నాన్నా, మీరూ అమ్మా, ఇప్పుడు మాకు పిల్లలు. మేం మీకు తల్లి దండ్రులం. మీబాధ్యత మాది' అంది పెద్దకూతురు.

చిన్నకూతురు భుజంమీద చేయివేసి "అప్పుడు మేం పిల్లలం .మీరు తల్లిదండ్రులు ఇప్పుడు మీరు పిల్లలు. మేం తల్లిదండ్రులం. అప్పుడు మాకు కావలసినవన్నీ మీరు చూశారు. ఇప్పుడు మీకు కావలసినవన్నీ మేం చూస్తాం. మీరొక్కరే మమ్మల్ని నలుగుర్ని సంరక్షించారు. ఇప్పుడు మేం నలుగురం. మిమ్మల్ని చూడడం న్యాయం 'ధర్మం.'

'తల్లుల్లారా మీ లాజిక్ బాగానే ఉంది.' అన్నాడో లేదో కొడుకులిద్దరూ వచ్చి సోఫాకింద తండ్రి కాళ్ళదగ్గర కూర్చుని తండ్రి ముఖంలోకి చూస్తూ 'నువ్వొక్కడివి మా నాన్నమ్మను ఎంతోప్రేమగా చూచుకొన్నావు కదా నాన్నా, అత్తమ్మను, బాబాయిని చదివించి పెళ్ళిళ్ళు చక్కగా చేశావు కదా నాన్నా మేం నలుగురం అంతమాత్రమైనా చూచుకోవద్దూ. మిమ్మల్ని ఇద్దర్నీ!'

' మా అమ్మ నాకు దేవత!'

'మానాన్న మాకు దేవుడే!'

రాజు కళ్ళలో నీళ్లు తిరిగాయి.

'మీరిద్దరూ ఎప్పుడైనా మా దగ్గరకు వచ్చి ఉండవచ్చు' అంది పెద్దకూతురు. 'ఎవరి దగ్గరైనా సరే' అంది చిన్నకూతురు. 'ఎప్పుడైనా మీ యిష్టం.' అన్నాడు పెద్దకొడుకు. 'ఈసారి మేనెల మొదట వారంలో మా దగ్గరకు మీరిద్దరూ రావాలినాన్నా' అన్నారు అందరూ.

'పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. మీ అంతగా ఆలోచించేవాళ్ళు అయ్యారు. మనం ఎప్పుడూ ఎవరి దగ్గరకూ పోకుండా వాళ్ళే వచ్చి పోవాలనుకోవటం బాగుండదు కదా' అంది రాజు భార్య.

రాజు ఆమె ముఖంలోకి ఎగాదిగా చూస్తున్నప్పుడు అందరూ ఒక్కసారిగా 'ఎప్పుడూ మేం వస్తూనే ఉంటాం. ఎప్పుడయినా మీరు కూడా రండి.'

'చూద్దాం' అన్నాడు రాజు. మెత్తబడ్డాడని అర్ధమయింది. అందరూ చూడ్డం కాదు 'వస్తాం అనండి' అన్నారు.

'అలాగే వస్తాం' అన్నాడు రాజు. 'వస్తాంలే నాయనా' అంది పిల్లలతో రాజు భార్య. 'అది కాదమ్మా' అన్నాడు భార్యతో రాజు. 'ఇంక ఏమీ అనొద్దు నాన్నా' భర్తతో అంది భార్య.

ఇద్దరూ ఒకరి ముఖం ఒకరు చూచుకొన్నారు.

'మేం ఎప్పుడైనా ఏమిచ్చినా డబ్బు ఇచ్చినా తీసుకోవాలి'

'బేంక్‌లో అయినా క్రెడిట్ చేస్తాం'

'ఎందుకు వచ్చినప్పుడే ఇవ్వవచ్చు.'

'అమ్మ చేతికయినా ఇవ్వవచ్చు' నలుగురు నాలుగు విధాలుగా చెబుతుంటే రాజు ముఖంలో రంగులు మారిపోసాగాయి. అది దుఃఖం కాదు. నిరాశ కాదు. సందేహం కాదు. ఆనందంకాదు. ఆవేశంకాదు. అన్నీ కలగలిస్తే ఏర్పడే భావశాబల్యం. అది ముఖమంతా విస్తరిస్తూ ఉంది.

భార్యచేతిలో డబ్బు పెట్టడం అన్న ఆలోచన పెళ్ళయిన మొదట్లోనే రాజు మానుకొన్నాడు. ఆమె నెలజీతం తెచ్చి చేతికిస్తుంటే రాజు తీసుకోలేదు. బేంక్‌లో వేసుకోమనేవాడు. కావలిసినప్పుడు తీసుకోమనేవాడు. ఆమెకు ఆమె జీతం మీద పూర్తి స్వేచ్ఛ ఉండేది. తన జీతంతో ఇల్లు గడిచేది. ఎప్పుడయినా అవసరాలు కనిపిస్తే 'ఒక్క జీతం వచ్చినవాళ్ళు బ్రతికినట్లే మనమూ బ్రతకాలనే వాడు. భార్య బేంక్ బేలన్స్ ఒక మొత్తంకాగానే ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయటమో, ఇళ్ళస్థలం కొనటమో, జరిగితే, నీపేరిట ఉండనీయమ్మా అని భర్త కోరితే వద్దు నాన్నా ఇద్దరి పేరిట ఉండనిద్దామనేది. అట్లా ఏర్పడ్డ ఆస్తులు ఆవిధంగా ఇద్దరిపేరిటా ఉన్నాయి. ఇప్పుడు వాటి విలువ ఎక్కువ.

రిటైరు అయినాక ఆమె ఎప్పుడైనా బేంకుకు పోయి నిలవ ఉన్న పెన్షన్ సొమ్ము ఫిక్సెడ్ చేసి వస్తుంది. ఎప్పుడయినా డ్రా చేసి పిల్లలకు ఏదైనా నగలు చేయిస్తుంది. బట్టలు కొనిపెడుతుంది. పిల్లలయితే తమ బట్టలు చూచి ఆనందిస్తారుకానీ, పెద్దవాళ్ళు ఆనందించటం సంపూర్ణంగా లేదని ఆమె గుర్తించింది.

కారణం భర్తను అడిగింది. 'వాళ్ళు మనకు చిన్నపిల్లలు గానే కనబడతారు. నిజానికి వాళ్ళు చాలాపెద్దవాళ్లు అయ్యారు. మనకంటే పెద్దవాళ్ళు అయ్యారు. మనం బట్టలమీద ఎక్కువ ఖర్చు చేయం. బట్టలు బాగుండాలి వాళ్ళు కొంచెం ఖర్చు చేస్తారు. మనం కొనే బట్టలు వాళ్లు కొనుక్కోదలచుకున్న బట్టలు లాగా ఉండవు.' అని చెబితే ఆమె ఆశ్చర్యంగా నోరెళ్ళబెట్టింది.

పిల్లలు ఉద్యోగాలలో చేరినాక రాజు వాళ్ళకు బట్టలు కొనలేదు. పెళ్ళిలో బట్టలు రాజు భార్య కొనిపెట్టింది. పెత్తనం ఆమెదే! అన్నీ ఆమే చూచుకొనేది.

రిటైరు అయినాక, భర్తకు డబ్బు కావలసి వస్తుందేమోనని 'నాన్నా ఏమన్నాకావాలా?' అని అడిగితే 'వద్దు తల్లీ' అని బదులు చెబుతూనే వచ్చాడు.

వాళ్ళ అమ్మ చేతికి వాళ్ళు డబ్బు ఇవ్వటం వాళ్ళ సరదా కావచ్చు. కాని ఆమెకు ఆ డబ్బు అవసరం క్షాదు. ఆమెను తన మీద ఆధారపడకుండా చూశాడు రాజు. పిల్లలమీద అధారపడడం భరించగలడా? రాజుకు తన తల్లి అంటే పిచ్చి ప్రేమ. అతను భార్యను తల్లి తర్వాత తల్లిగా భావించి, ప్రేమించి, గౌరవించి ఆరాధిస్తాడు.

తల్లి చేతికి డబ్బులిస్తామంటే ఆమెను తీసుకొనే స్థాయిలో ఊహించుకొంటేన్ గుండె కలుక్కుమంది. తమ ఆస్తులన్నీ ఆమె సంపదే!

ఈ పిల్లలు కూడా ఆమె ఆస్తులే! ఆమె సంపదే!

వీళ్ళు ఆమె కిచ్చేదేమిటి? పిల్లలు అమాయకంగా ఉన్నారు.

ఒక్కటి వాస్తవం. తమ దగ్గరున్న డబ్బు తరుగుదలతో ఉంది. వాళ్ళ దగ్గర డబ్బు పెరుగుదలలో ఉంది.

అంతమాత్రం చేత వాళ్ళు ఇచ్చేవాళ్ళు మేం పుచ్చుకొనేవాళ్ళం కాలేమనుకొన్నాడు రాజు.

తాము వాళ్ళకు ప్రేమ పంచి ఇచ్చారు. వాళ్ళు కూడా సంపూర్ణ ప్రేమను అనుగ్రహిస్తున్నారు.

నాడు తమ ప్రేమలో భాగంగా డబ్బు ప్రాముఖ్యం వహించింది.

నేడు వాళ్ళ అనురాగంలో అంతర్భాగంగా ఆర్థిక కోణం రాజు చూడలేకుండా ఉన్నాడు. చూచి ఇష్టపడలేకుండా ఉన్నాడు.

'నాన్నా మీరు నాలుగు కాలాల పాటు బ్రతకాలి. మేం ఎప్పుడు ఏంచేయాలో మాకు సలహాలు సూచనల్ను ఇస్తుండాలి. మీరు సంపాదించిన ఆస్తుల్ని పెంచనక్కరలేదు. వాటిని కరగదీయరాదు. అవి కరిగిపోసాగితే మీ ఆయుఃప్రమాణం ప్రశ్నార్థకమవుతుంది. అదికారాదు. మీరు నిలవధనం నుంచి మూలధనం నుంచి ఏమయినా తీయదలచుకొంటే బాధపడతారు. మా దగ్గర డబ్బు తీసుకొంటే మేం ఆనందిస్తాం. నిలవధనం నిలవధనంగానే ఉంటుంది. అది మీ ఆరోగ్యం, ఆయుష్షు, ఆనందం పెంచుతుంది.

పిల్లలు ఎనిమిదిమంది ఎన్నోరకాలుగా చెప్పినా వాళ్ళు స్థూలంగా చెప్పిన ముక్క మేం డబ్బు ఇస్తే వద్దు అనొద్దని. రాజు జాగ్రత్తగా విన్నాడు. తల పంకించాడు.

'ఈ పదివేలు నేనడగలేదు. నాకవసరంలేదు. మీరు ఎవరు నా పర్సులో పెట్టారో

వాళ్ళు తీసుకోండి. పర్సులోంచి డబ్బుతీసి టీపాయ్ మీద పెడుతూ చెప్పాడు. నాకు అవసరమయినప్పుడు అమ్మ మీకు కబురుచేస్తుంది. సరేనా?' అంటూ బైటికి బయలుదేరాడు మేడే మీటింగుకు పోవాలంటూ!

'నానా!' అంది రాజు భార్య. రాజు ఆగాడు. 'అది పిల్లల డబ్బుకాదు. మన డబ్బు. నేనే బేంక్ నుంచి డ్రా చేశాను'

'ఎప్పుడూ?'

'నిన్ననే! పిల్లలు వస్తారు. ఖర్చులుంటాయి అని'

'నా తోడు లేకుండా నువ్వు బేంక్‌కు పోయి రాగలిగావా?'

'ఎప్పటికీ పోయిరాలేనా? పోకూడదా? పోయి డ్రా చేసి తెచ్చాను,. చెప్పే మాట వినండి. డబ్బు డ్రాచేసి ఇచ్చి ఇళ్ళు కట్టించమంటే కట్టించారు. ఇళ్ళస్థలాలు కొనమంటే కొన్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయమంటే చేశారు. నేను డబ్బు మీచేతికిచ్చి ఏంచేయమంటే అది చేశారు. ఎలాఖర్చుపెట్టమంటే అలా ఖర్చుపెట్టారు.'

'నేను కాదనలేదు కద తల్లి!'

'అందుకే చెబుతున్నాను వినండి. పిల్లల చదువులకు ఖర్చు చేస్తున్నప్పుడు మీరు ఈ మొత్తం పిల్లలమీద మన పెట్టుబడి అనేవాళ్ళు గుర్తుందా?' అంది. 'అవును అనేవాణ్ణి'అన్నాడు రాజు. 'ఈ పదివేలు పిల్లలమీద ఖర్చు చేయండి. అదికూడా పిల్లలమీద మన పెట్టుబడీ!' అంది. రాజు నిరుత్తరుడై నిలబడ్డాడు.

టీపాయ్‌మీద పదివేలు రూపాయలనోట్ల పొత్తి తీసి చేతికిచ్చింది. చేయి పేంట్ జేబులో పెట్టింది. చేయి బయటకు తీయకుండా అదిమి పట్టింది.

'మీరు వెళ్ళిరండి' అంటూ వాకిలిదాకా వచ్చింది. 'భవిష్యత్తులో ఈ దేశంలో మనం పుట్టామని, పెరిగామని, పిల్లల్ని బాగా పెంచామని, వాళ్ళు లోకానికి మేలు చేసేవాళ్ళు అయ్యారని దేశసంపద పెంచే వాళ్ళుగా మారారని, మీరు అంటుండేవాళ్ళు, గుర్తుందికదా! దేశ సంక్షేమం కోరేవాళ్ళు, దేశసౌభాగ్యం పెంచేవాళ్ళు, దేశసౌభ్రాతృత్వం తెచ్చేవాళ్ళు మన పిల్లలే! మన పెట్టుబడులే!మన ఆనంద సంకేతాలేకదా నాన్న. వాళ్ళను దేశభవిష్యత్తుకు మన అనుగ్రహిస్తే, వాళ్ళు మన భవిష్యత్తును ఈ లోకంలో భద్రంగా, సురక్షితంగా, శాశ్వతంగా నిలిపేవాళ్ళు చైతన్యజ్యోతులు ఆశాకిరణాలు అయ్యారు. అంతకంటే అదృష్టం ఏంకావాలి నాన్నా మనకు.'

రాజుని భార్య ముద్దు పెట్టుకోవడం చూచి పిల్లలు అందరూ చెకాబికి వచ్చి చుట్టూచేరి తల్లిదండ్రుల్ని ముద్దులతో ముంచెత్తుతున్నారు. కుర్చీలెక్కి ముద్దుపెట్టేవాళ్ళు. చంకెక్కి ముద్దుపెట్టేవాళ్ళు, 'కీ' 'బే' అంటుంటే రాజుకు స్వర్గం కాళ్ళకిందికి వచ్చి పైకెత్తుతున్నట్లుగా అనిపించింది.